TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 209 ఆదివారం, జూన్ 14, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు

అత్యుత్తమమైన సేవలు,

ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.

జైత్ర

మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

మా ప్రత్యేకతలు

- అత్యవసర & క్రిటికల్ కేర్
- ప్రమాద సేవలు
- ప్రసూతి & గైనకాలజీ
- ఆర్థోపెడిక్స్
- జాయింట్ రీప్లేస్‌మెంట్స్
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జరీ
- మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
- పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
- న్యూరాలజీ • న్యూరోసర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
- యూరాలజీ • డెర్మటాలజీ
- సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ

అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్

+91 85230 89599 +91 86889 09384

www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

# మోదీ హయాంలో అద్భుత శక్తిగా భారత్



### మొబైళ్ల నుంచి మిస్సైళ్ల దాకా దేశీయంగానే తయారీ
### గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి రాచబాటలు
### మేధావుల సదస్సులో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్: ప్రధాని మోదీ పాలనలో మొబైళ్ల నుంచి మిస్సైళ్ల వరకు ఏదైనా దేశీయంగా తయారు చేసే అద్భుత శక్తిగా భారత్ ఎదిగిందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నారని కొనియాడారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులిచ్చిందని, 2014 ముందుతో పోలిస్తే జాతీయ రహదారులు రెట్టింపు మంజూరు చేశామని, ఐదు వందేభారత్‌లు, ఆరు అమృత్‌భారత్ రైళ్లను రాష్ట్రానికి కేటాయించామని తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్‌లో జరిగిన మేధావుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుతోపాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ.. 'గత 12 ఏళ్లలో తెలంగాణకు అనేక ప్రాజెక్టులు మంజూరయ్యాయి. ఒకప్పుడు ఉమ్మడి ఏపీకి రైల్వే బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు మాత్రమే దక్కేవి. ఇప్పుడు ఒక తెలంగాణకే ఏటా రూ.5,500 కోట్ల వరకు కేంద్రం ఇస్తోంది. రాష్ట్రానికి పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కు వంటి బృహత్తర ప్రాజెక్టు మంజూరైంది. మోదీ వచ్చాక ప్రతి రూపాయి దేశ భద్రతకు, అభివృద్ధి కోసమే వెచ్చిస్తున్నారు. 12 ఏళ్లలో దేశంలో ఏకంగా 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి విముక్తి చేయడమే ఇందుకు నిదర్శనం. మావోయిస్టుల తుపాకుల మోతలు వినిపించే చోట.. బడి గంటలు వినిపించాలన్నదే మా సంకల్పం. రక్షణరంగ బడ్జెట్‌ను రూ.7 లక్షల కోట్లకుపైగా పెంచాం. ఫలితంగా ఆపరేషన్ సిందూర్ లాంటివి విజయవంతంగా చేసి పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పాం' అని పేర్కొన్నారు.

**సేవకుడిలా పనిచేస్తున్నారు**

దేశానికి మోదీ ప్రధాన మంత్రిగా కాకుండా ప్రధాన సేవకుడిగా పనిచేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇంతకు ముందు రాష్ట్రాల మధ్య పోటీ ఉండేది కాదని, మోదీ సీఎంగా గుజరాత్‌ను అభివృద్ధి చేశాక అన్ని రాష్ట్రాల సీఎంలు అలా తయారు చేసేందుకు పోటీపడుతున్నారని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్, సర్జికల్ స్ట్రైక్స్ లాంటివి విజయవంతంగా చేపట్టి రాజ్‌నాథ్ సింగ్ భారతదేశ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. టీ అమ్మిన వ్యక్తి దేశ ప్రధాని కావడం మన ప్రజాస్వామ్య వ్యవస్థకు అద్దం పడుతోందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, డీకే అరుణ, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, కొమరయ్య, అంజిరెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, పార్టీ నేతలు చంద్రశేఖర్ తివారీ, జమున, గౌతంరావు, వీరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**డీఆర్‌డీఎల్‌లో 'అడ్వాన్స్‌డ్ వెపన్ సిస్టమ్ కాంప్లెక్స్' ప్రారంభం**

డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తున్న స్వదేశీ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ 'ప్రాజెక్ట్ కుషా'తో దేశ వాయు రక్షణ కవచం మరింత బలోపేతమవడమే కాకుండా భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధం చేస్తుందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ(డీఆర్‌డీఎల్)లో 'అడ్వాన్స్‌డ్ వెపన్ సిస్టమ్ కాంప్లెక్స్'ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం శాస్త్రవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో స్వదేశీ క్షిపణి వ్యవస్థలు ప్రదర్శించిన అసాధారణ పనితీరు, భారతదేశ ఆర్అండ్‌డీ సామర్థ్యానికి నిదర్శనం. ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రభుత్వం 'మిషన్ సుదర్శన్ చక్ర' ద్వారా బహుళస్థాయి క్షిపణి రక్షణ వ్యవస్థను రూపొందించడానికి కట్టుబడి ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ యు.రాజాబాబు, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ అంకతి రాజు తదితరులు పాల్గొన్నారు.

# అమర్‌నాథ్ యాత్రకు పటిష్ట భద్రత

## కేంద్ర హోంమంత్రి అమిత్ షా



దిల్లీ: అమర్‌నాథ్ యాత్ర ప్రశాంతంగా సాగేలా చూసేందుకు, యాత్రా మార్గంలో, పర్యాటక ప్రాంతాల్లోనూ కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్), జమ్మూకశ్మీర్ పోలీస్ శాఖతోపాటు అన్ని భద్రతా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారు. జులై 3 నుంచి ప్రారంభమయ్యే యాత్ర ఏర్పాట్లపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాలు, నిఘా వ్యవస్థలను విస్తృతంగా ఉపయోగించాలని సూచించారు. యాత్రలో పాల్గొనే భక్తుల నమోదు, వసతి, వైద్య సేవల నిర్వహణ వంటి అంశాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని యాత్రికుల బృందాల కదలికలను నియంత్రించాలని, శిబిరాల వద్ద భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. యాత్ర మార్గాలతో పాటు ప్రధాన పర్యాటక కేంద్రాల్లోనూ కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు.

# మళ్లీ కుండపోత, అప్పటి దాకా వర్షాలే - తాజా హెచ్చరిక...!!

మరోసారి కుండపోత తప్పేలా లేదు. హైదరాబాద్ తో పాటుగా పొరుగు జిల్లాల్లో వర్షం మొదలైంది. భారీగా ఈదురు గాలులతో వర్షం కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి భాగ్యనగరం తడిసి ముద్దయింది. ఇప్పుడు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తాజాగా వాతావరణ శాఖ వెల్లడించింది. కొండాపూర్ లో గంటన్నార సమయంలో 8.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు భారీ వర్షాలు కొనసాగుతాయని అలర్ట్ జారీ చేసారు. హైదరాబాద్ తో పాటుగా శివారు ప్రాంతాలు.. వికారాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో భారీ వర్షం పడుతోంది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వాన కురుస్తోంది. శుక్రవారం రాత్రి కురిసిన వానతో నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. హైదరాబాద్‌లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రానున్న మరికొన్ని గంటల్లో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్, మహబూబాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, యాదాద్రి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వర్షం సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వాతావరణం అనుకూలించకపోవడంతో సీఎం రేవంత్ ప్రయాణిస్తున్న విమానాన్ని బెంగుళూరుకు దారి మళ్లించారు. సీఎం ఢిల్లీ నుంచి 6ఈ717 ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరారు.

## ప్ర రా బి నేటిమాట..

పశ్చాత్తాపం గతాన్ని మార్చలేదు. ఆందోళన భవిష్యత్తును మెరుగుపరచలేదు. వర్తమానాన్ని ఆస్వాదించడమే పరమానందం:

ప్రపంచంలో ఒక్క మనిషికి మాత్రమే ఉండే మానసిక రోగం "ఓర్వలేనితనం"

తనకు లేనిది ఉన్నవాళ్ళను చూసి ఏడ్చేవాడికి ఎన్ని ఉన్నా వాడు నిత్య దరిద్రుడే.

- ప్రమీల రాణి బి

## రక్షణ ఒప్పందాలే లక్ష్యంగా..

# నేటి నుంచి మోదీ ఫ్రాన్స్ పర్యటన



దిల్లీ: కీలకమైన సముద్ర మార్గాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో నీటి అడుగున సైనిక పోరాట సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవాలనుకుంటున్న భారత్.. శనివారం నుంచి ప్రారంభం కానున్న ప్రధాని మోదీ పర్యటనలో ఫ్రాన్స్‌తో కీలక రక్షణ ఒప్పందాలను కుదుర్చుకొనే అవకాశం ఉంది. ఒమన్ జలసంధిలో ప్రస్తుతం నెలకొన్న పరిణామాల దృష్ట్యా సముద్ర గర్భంలో ఆధిపత్యాన్ని పెంపొందించుకోవాలని భారత నౌకాదళం భావిస్తోంది. ఈ నేపథ్యంలో మరిన్ని జలాంతర్గాములను ఫ్రాన్స్ నుంచి భారత్ కొనుగోలు చేసే అవకాశం ఉంది. వీటితో పాటు.. రెండేళ్ల క్రితం రెండు దేశాల మధ్య కుదిరిన రూ.36 వేల కోట్ల విలువైన స్కార్పీన్ జలాంతర్గాముల ఒప్పందంపైనా చర్చలు జరగనున్నాయి. రెండేళ్ల క్రితమే ఈ ఒప్పందం జరిగినా.. సాంకేతిక కారణాలతో ఈ ప్రాజెక్టు అమలు ఆలస్యమవుతోంది. ఐరోపా పర్యటనలో మోదీ.. ఫ్రాన్స్‌తో పాటు, స్లొవేకియాలోనూ పర్యటించనున్నారు. జీ7కు సంబంధించిన సదస్సుల్లోనూ పాల్గొంటారు.

**మహిళా అభివృద్ధికి ఎన్డీయే కృషి: మోదీ**

దిల్లీ: మహిళల గౌరవం, వారికి సమాన అవకాశాలు, సాధికారత లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం కృషిచేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వ్యాఖ్యానించారు. మహిళలు తమ పూర్తి సామర్థ్యాన్ని గ్రహించి జాతి నిర్మాణంలో భాగమయ్యేలా వాతావరణం సృష్టించడంలో ఈ ప్రయత్నాలు తోడ్పడ్డాయని ఆయన అన్నారు. గత 12 సంవత్సరాలలో ఎన్డీఏ ప్రభుత్వం మహిళా అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని, ఇప్పుడు అన్ని రంగాల్లో అది కనిపిస్తోందని పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్రం, అంతరిక్షం, ఆవిష్కరణ వంటి రంగాల్లో భారత నారీశక్తి తనదైన ముద్ర వేయడం సంతోషంగా ఉందని మోదీ తెలిపారు. ఆర్థిక సమ్మిళితత్వం, వ్యాపారం నుంచి విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, గృహనిర్మాణం, క్రీడలు, విజ్ఞాన శాస్త్రం, పరిపాలన వరకూ అన్ని రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు.

# మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంలో చుక్కెదురు

### మా జోక్యానికి రాజ్యాంగ నిబంధనలు అనుమతించవు
### పిటిషన్ కొట్టివేస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య
### ఆర్వో నిర్ణయాన్ని సవాల్ చేయడానికి ఎన్నికల పిటిషనే సరైన మార్గమని వెల్లడి



దిల్లీ: రాజ్యసభ నామినేషన్ పత్రం తిరస్కరణపై సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కాంగ్రెస్ పార్టీ నేత మీనాక్షి నటరాజన్‌కు ఉపశమనం లభించలేదు. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని, రాజ్యాంగ నిబంధనలూ అందుకు అనుమతించబోవంటూ ఆమె పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. ఈ కేసు యోగ్యత గురించి తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని పేర్కొంది. అయితే, ఎన్నికల పిటిషన్ ద్వారా రిటర్నింగ్ అధికారి(ఆర్వో) నిర్ణయాన్ని సవాల్ చేసే స్వేచ్ఛను ఆమెకు కల్పించింది. ఎన్నికల పిటిషన్‌ను ఎన్నికలు నిర్వహించిన రాష్ట్రంలోని హైకోర్టులోనే దాఖలు చేయాలి. దానిపై నిర్ణయం తీసుకునే అధికార పరిధి హైకోర్టుకు మాత్రమే ఉంటుంది. సుప్రీం ధర్మాసనం సూచించిన విధంగా హైకోర్టుకు వెళ్లనున్నట్లు కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బెంగళూరులో తెలిపారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేయగా ఆర్వో తిరస్కరించడంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఆమె తరఫున శుక్రవారం వాదనలు వినిపించారు. కనీసం రెండేళ్లు జైలు శిక్ష పడే క్రిమినల్ కేసులు కూడా ఆమెపై లేవని పేర్కొన్నారు. సమన్లు మాత్రమే జారీ అయ్యాయన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం క్రిమినల్ కేసులను వెల్లడించలేదనే కారణం చూపిస్తూ నామినేషన్ పత్రాన్ని ఆర్వో తప్పుడు విధానంలో తిరస్కరించారని ఆరోపించారు. ధర్మాసనం స్పందిస్తూ... 'రిటర్నింగ్ అధికారి నిర్ణయం ఎంత తప్పు అయినప్పటికీ ఒకసారి నామినేషన్ తిరస్కరణకు గురైతే దాని పరిష్కారం వేరే చోట ఉంటుంది. న్యాయస్థానం ఇలాంటి దశలో జోక్యం చేసుకున్నట్లు ఏదైనా ఆధారం ఉందా? అలాంటి తీర్పు ఏదైనా చూపించండి' అని ప్రశ్నించింది.

'రాజ్యాంగ అధికరణం 32/226 ప్రకారం..నామినేషన్ తిరస్కరణకు సంబంధించిన కేసులను గుర్తించడానికి న్యాయస్థానం అంగీకరిస్తే, అధికరణం 329(బి)పరిధిలో లేని ఒక సూత్రాన్ని ఈ కోర్టు అన్వయించినట్లు అవుతుంది. అంతేకాదు కొన్ని విషయాల్లో కోర్టు జోక్యం చేసుకోవచ్చని, మరికొన్నింటిని ఎన్నికల ట్రైబ్యునల్ విచారణకు వదిలివేయాలనే వ్యాఖ్యానాలను ప్రోత్సహించేందుకు మేము భయపడుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది.

'రాజ్యాంగ అధికరణం 329.. ఎన్నికల వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోకుండా నిరోధిస్తుంది. కోర్టు కేసుల వల్ల ఎన్నికలు ఆలస్యం కాకుండా చూస్తుంది. అందువల్ల ఆర్వో ఒక అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించిన తర్వాత ఎన్నికల పిటిషన్ దాఖలు చేయడమే ఏకైక మార్గం. చట్టం ప్రకారం సంబంధిత హైకోర్టులో దాఖలయ్యే పిటిషన్ వల్ల ఎవరి హక్కులకూ భంగంకలగదు' అని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించిన నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రపతి భవన్ వరకు ర్యాలీ చేపట్టిన కాంగ్రెస్ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

**ప్రజాస్వామ్యానికి ఎదురుదెబ్బ: మీనాక్షి**

పిటిషన్ తిరస్కరణ అనంతరం మీనాక్షి నటరాజన్ స్పందిస్తూ...ఇది తనకు కాదు, భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి తగిలిన గట్టి ఎదురుదెబ్బ అని అన్నారు. 'సీటు చోరీ అయ్యిందన్నది సుస్పష్టం. ఎన్నికల సంఘం సభ్యులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని నేను మొదటే చెప్పాను. మా వాళ్లు ఎన్నికల సంఘం వద్దకు వెళ్లారు. 48 గంటల పాటు మాకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. సుప్రీంకోర్టు కనీసం మా విన్నపాన్ని ఆలకించింది' అని తెలిపారు. భాజపా, ఈసీ కుమ్మక్కుకు వ్యతిరేకంగా ప్రజాన్యాయస్థానంలో పోరాడుతామన్నారు. తదుపరి ఏమి చేయాలన్నది పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు.

## సంపాదకీయం

**ఆదివారం, జూన్ 14, 2026**

### దిగొస్తున్న బంగారం ధరలు

బంగారం ధరలు పతనమన్న వార్త మధ్యతరగతి ఇళ్లల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళల మొహాల్లో వెయ్యి వాట్ల బల్బు వెలిగినంత హ్యాపీనెస్ జిగేల్మంటోంది. మగవారికి జీతం పెరిగినప్పుడు వచ్చే సంతోషం ఒకెత్తయితే..మహిళలకు బంగారం ధర తగ్గినప్పుడు వచ్చే ఆనందం ఇంకో ఎత్తు. ఎందుకంటే, మధ్యతరగతి మహిళల దృష్టిలో బంగారం అనేది కేవలం ఒక నగ కాదు..అది వారి కష్టార్జితం, దాచుకున్న రహస్య పొదుపు, ఆపదలో ఆదుకునే ఒక నమ్మకం. నెలనెలా దాచుకున్న చిట్టీ డబ్బులు తీసి ఓ చిన్న ముక్కుపుడకో, ఉంగరమో కొనడం ఆడవాళ్లు ఆర్థికభద్రతగా భావిస్తారు. బంగారం ధర పది రోజుల్లో ఏకంగా 10 వేల 690 రూపాయలు తగ్గింది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం లక్షా 45 వేల 640కి దిగి వచ్చింది. ఒక్కరోజులోనే 2 వేలకు పైగా తగ్గింది. కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్రంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. 2026 ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో రికార్డ్ స్థాయిలో ఒక ఔన్స్ బంగారం ధర దాదాపు 5,500 నుంచి 5,600 డాలర్ల దగ్గర ఆల్‌టైమ్ హైని తాకింది. కానీ, గడిచిన కొన్ని వారాల్లోనే అది ఏకంగా 4,200 డాలర్ల స్థాయికి పడిపోయింది. అంటే దాదాపు 15 నుంచి 20 శాతం వరకు క్షీణత. ఇరాన్ యుద్ధం మళ్లీ ఉద్రిక్తతలను పెంచుతోంది. ద్రవ్యోల్బణం భయపెడుతోంది.. అయినా సరే, సేఫ్ హెవెన్ గా భావించే బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి.. దీని వెనుక గ్లోబల్ ఎకనామిక్ గేమ్ ఏంటన్న విశ్లేషణ సాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 15శాతానికి పైగా తగ్గితే, ఇండియాలో కేవలం 4 నుంచి 5 శాతమే తగ్గాయి. దీనికి కారణం మన రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడటం. అలాగే 2026 మేలో భారత ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి 15శాతానికి పెంచడం. ఈ డ్యూటీ పెంపుతో మన దేశీయ మార్కెట్లో పూర్తి స్థాయిలో తగ్గుదల ప్రభావం కనిపించలేదు.ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది. డాలర్‌కు, గోల్డ్‌కు ఎప్పుడూ వ్యతిరేక సంబంధమే. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే బలంగా ఉంది. డాలర్ బలంగా మారినప్పుడు, ఇతర కరెన్సీలు ఉపయోగించే దేశాలకు బంగారం కొనడం ఖరీదైన వ్యవహారం. దీనివల్ల అంతర్జాతీయంగా పుత్తడికి డిమాండ్ తగ్గి, ధరలు తగ్గుముఖం పడతాయి. 2026 ప్రారంభంలో, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని అందరూ భావించారు. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ సీన్ రివర్స్ అయింది. అమెరికాలో ఇటీవల విడుదలైన ఉద్యోగాల గణాంకాలు చాలా బలంగా వచ్చాయి. దీనికి తోడు పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు పైపైకి ఎగబాకాయి. చమురు పెరగడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భయాలు మొదలయ్యాయి. ఫలితంగా, యూఎస్ ఫెడ్ తన వడ్డీ రేట్ల కోతను సెప్టెంబర్ 2026 లేదా ఆ తర్వాతకు వాయిదా వేసింది. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నంత కాలం, పెట్టుబడిదారులు బంగారాన్ని వదిలి బాండ్లపై దృష్టి పెడతారు. ఎందుకంటే బంగారం ఎలాంటి వడ్డీని ఇవ్వదు, కానీ యూఎస్ బాండ్లు ప్రస్తుతం దాదాపు 1.74శాతం రియల్ ఈల్డ్‌ను అందిస్తున్నాయి. దీంతో గోల్డ్ డిమాండ్ తగ్గి?రేట్లు డౌనయ్యాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లేటెస్ట్ రిపోర్ట్ ప్రకారం, 2026 మొదటి క్వార్టర్‌లో సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు దాదాపు 22శాతం తగ్గాయి. బంగారం ధరలు విపరీతమైన గరిష్ట స్థాయికి చేరడంతో, బ్యాంకులు కూడా కొత్త కొనుగోళ్లను కాస్త ఆపి, ప్రాఫిట్ బుకింగ్ వైపు మొగ్గు చూపాయి. అలాగే రష్యా సెంట్రల్ బ్యాంకు కూడా భారీగా భౌతిక బంగారం అమ్మేసుకుంటోంది. ఉక్రెయిన్ నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా?వార్‌ను కంటిన్యూ చెయ్యడానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి గోల్డ్ వదిలించుకుంటోంది. ఈ నాలుగు నెలల్లో సుమారు 30 టన్నుల గోల్డ్‌ను సెల్ చేసింది.ఫిజికల్ గోల్డ్ కు డిమాండ్ తగ్గడం కూడా రేట్ల పడిపోవడానికి మరో కారణం. భారత్, చైనా వంటి దేశాల్లో ఆభరణాల డిమాండ్ గణనీయంగా పడిపోయింది. 2025, 2026 లలో ధరలు లక్షన్నర దాటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనడం తగ్గించేశారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ, లైట్ వెయిట్ జ్యువెలరీ లేదా పాత బంగారాన్ని మార్పిడి చేసుకోవడం పెరిగింది. మన దేశంలో బంగారం ధర పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ మీద మాత్రమే ఆధారపడి ఉండదు. కొన్ని లోకల్ ఫ్యాక్టర్స్ పనిచేస్తాయి. డాలర్–రూపాయి మార్పిడి రేటు అందులో ఒకటి. డాలర్ ఇండెక్స్ పెరగడం వల్ల రూపాయి విలువ దాదాపు 95 రూపాయల మార్కును దాటి వెళుతోంది. రూపాయి బలహీనపడితే మనం దిగుమతి చేసుకునే బంగారం ఖరీదవుతుంది. దిగుమతులు కూడా తగ్గుతాయి. డిజిటల్ గోల్డ్, ఇటిఎఫ్‌ల ట్రెండ్ బాగా పెరిగింది. భౌతిక బంగారం కంటే ఇప్పుడు యువత గోల్డ్ ఇటిఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ధరలు భారీగా పెరగడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. డిమాండ్ సప్లై సూత్రం ప్రకారం?డిమాండ్ డౌనయ్యింది?రేటు దిగొచ్చింది. దేశంలో విదేశీ మారక నిల్వలను కాపాడటానికి ఒక్క ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనడం ఆపాలని ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను కోరారు. పశ్చిమ ఆసియా యుద్ధంతో చమురు ధరలు పెరిగాయని?ఆయిల్ కొనడానికి డాలర్లు కావాలి కాబట్టి.. బంగారం దిగుమతులు తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ ప్రకటన వచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి ఏకంగా 15శాతానికి పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. సుంకం పెరగడం వల్ల విదేశాల నుంచి అధికారికంగా బంగారం దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇది దేశీయంగా బంగారం కొత్త కొనుగోళ్లను చాలా వరకు నియంత్రించింది. మోడీ పిలుపునిచ్చిన 10 రోజుల్లోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జ్యువెలరీ షాపుల్లో సేల్స్ 80శాతం పడిపోయాయి.

**- ఎడిటర్**


# 59 నియోజకవర్గాలు రెండు భాగాలు

**111 నియోజకవర్గాలు మూడు భాగాలు**
**సౌత్ లో పెరగనున్న 170 స్థానాలు**

హైదరాబాద్, జూన్ 13, (న్యూస్ పల్స్)దక్షిణది రాష్ట్రాలకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ గుడ్ న్యూస్ చెప్పారు. కొంతకాలంగా కొంతమంది రాజకీయ నాయకులు దక్షిణాది మీద అడ్డగోలుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. కెసిఆర్ నుంచి మొదలు పెడితే రేవంత్ రెడ్డి వరకు దక్షిణాది రాష్ట్రాలను నరేంద్ర మోడీ పట్టించుకోవడంలేదని.. పార్లమెంటు స్థానాల పెంపు విషయంలో కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయితే దీనిపై బీజేపీ సరిగా కౌంటర్ ఇవ్వలేకపోయింది. ఇప్పుడు బిజెపి తీసుకొచ్చిన ప్లాన్ ఆ తరహా నాయకుల నోర్లు మూసే విధంగా ఉంది.గతంలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశం తేలిపోయింది. మెజారిటీ సభ్యులు ఆమోదం తెలపకపోవడంతో ఆ అంశంలో కేంద్ర ప్రభుత్వం విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు అంచనాలకు మించిన బలాన్ని సొంతం చేసుకున్న తర్వాత కేంద్రం మరొకసారి డీలిమిటేషన్ బిల్లును తెరపైకి తీసుకొస్తుంది. మన దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిని పెంచాలని కేంద్రం భావిస్తున్నది. దీనివల్ల ప్రజలకు మరింత సమర్థవంతమైన పరిపాలన లభిస్తుందని కేంద్రం చెబుతోంది. ఇప్పటికే పార్లమెంటు స్థానాల పెంపు విషయాన్ని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది. కీలకమైన ప్రతిపాదనలను అందించిందిజనాభా పెరిగినప్పుడు ఖచ్చితంగా నియోజకవర్గాల పునర్విభజన సాధ్యమవుతుంది.నియోజకవర్గాల పెంపునకు పెరిగిన జనాభాను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుత జనాభా నివేదికలో పట్టణీకరణ.. ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని ప్రధాని ఆర్థిక సలహా మండలి సూచించింది. దీనివల్ల దేశంలో అన్ని ప్రాంతాలకు పరిపాలన మరింత చేరువవుతుందని.. ఆ ప్రజలకు ప్రతినిధులుగా ఎంపీలు ఉంటారని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది..ఇక దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. కొత్త ప్రతిపాదనలను కేంద్రం అమలు చేస్తే వాటి సంఖ్య 824కు చేరుకునే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాలలో సీట్ల పెంపు ఏకంగా 50% వరకు ఉంటుంది. చిన్న రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న స్థానాలను రెట్టింపు చేస్తారని సమాచారం. దీనివల్ల ఎంపీలు ప్రజలకు మరింత చేరువగా ఉంటారని తెలుస్తోంది.. ప్రధాని ఆర్థిక మండలి నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా 170 పార్లమెంట్ నియోజకవర్గాలను పునర్విభజిస్తారు. ఇందులో 59 నియోజకవర్గాలు రెండు భాగాలవుతాయి. 111 నియోజకవర్గాలు మూడు భాగాలవు తాయి. దీనివల్ల ప్రజలకు ఎంపీలు మరింత దగ్గరవుతారు. సమస్యలను నేరుగా పరిష్కరిస్తారు.నరేంద్ర మోడీ దక్షిణాది రాష్ట్రాలకు పునర్విభజనలో అదిరిపోయే కానుక ఇచ్చే అవకాశం ఉంది. కేరళ రాష్ట్రంలో ప్రస్తుతం 20 స్థానాలు ఉండగా.. అవి 30 కి పెరుగుతాయి. తమిళనాడులో 39 నుంచి 59.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో కూడా స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఇక మన దేశంలో అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పార్లమెంటు స్థానాలు 120కి పెరిగే అవకాశం ఉంది. అక్కడ దాదాపు 80 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి.కొత్త నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజల ఓటింగ్ కూడా 2.3 శాతం వరకు పెరుగుతు ంది. మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా మహిళల కోసం పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 2027 జనాభా లెక్కల తర్వాతనే చేపట్టాలని కమిటీ ప్రకటించింది.నియోజకవర్గాలపునర్విభజనపూర్తయితే దేశంలో రాజకీయంగా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది

## 97 శాతం తగ్గిన మొబైల్ డేటా చార్జీలు

హైదరాబాద్, జూన్ 13, (న్యూస్ పల్స్)పెట్రోల్ ధరలు పెరిగాయని, డీజిల్ ధరలు పెరిగాయిని, గ్యాస్ ధరలు పెరిగాయని, కంరెటు చార్జీలు పెరిగాయని, బస్సు చార్జీలు పెరిగాయని వామపక్ష పార్టీలు, విపక్షాలు ఆందోళనలు చేయడం సహజం. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్రో, గ్యాస్ ధరలపైనే విపక్షాలు ఎక్కువగా ఆందోళన చేశాయి. అయితే ధరలు తగ్గినప్పుడు మాత్రం ఎవరూ స్వాగతించరు. అయితే రోజురోజుకు అన్నింటి ధరలు పెరుగుతున్నాయి. కానీ 12 ఏళ్లలో అనూహ్యంగా ఒకదాని ధర 97 శాతం తగ్గింది. అందరికీ అందుబాటులోకి వచ్చింది. అందే మొబైల్ డేటా.కేంద్ర ప్రభుత్వం డిజిటల్ రంగంలో సాధించిన అపూర్వ విజయాన్ని వెల్లడించింది. 2014లో 1 గిగాబైట్(జీబీ) డేటా ధర రూ.269 ఉంటే, ప్రస్తుతం అది కేవలం రూ.9.2కి తగ్గింది. అంటే గత 4,399 రోజుల్లో (సుమారు 12 ఏళ్లలో) డేటా ధరలో 97 శాతం తగ్గుదల నమోదైంది.ఇది భారత్ డిజిటల్ చరిత్రలో ఒక మైలురాయి. ఈ అద్భుత మార్పు వెనుక కేంద్ర ప్రభుత్వం నిరంతరం చేపట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమం, భారత్‌నెట్ ప్రాజెక్ట్, ఆప్టికల్ ఫైబర్ విస్తరణ, పోటీతత్వం ప్రోత్సాహం, 2016లో రిలయన్స్ జియో ప్రవేశం వంటి అనేక అంశాలు కలిసి ఈ ధరల తగ్గుదలకు దోహదపడ్డాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించడం, స్పెక్ట్రం అలాట్‌మెంట్‌లో పారదర్శకత, 5జీ సేవల వేగవంతమైన రోల్‌అవుట్ వంటి చర్యలు డేటా సరఫరాను భారీగా పెంచి, ధరలను తగ్గించాయి.ఈ చౌక డేటా ధరల వల్ల దేశవ్యాప్తంగా




కోట్లాది మంది సామాన్యులు, విద్యార్థులు, రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు, గ్రామీణ యువతకు అధునాతన ఇంటర్నెట్ సేవలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. విద్యా రంగంలో ఆన్‌లైన్ క్లాసులు, డిజిటల్ లెర్నింగ్ఆరోగ్య రంగంలో టెలి మెడిసిన్ సేవలు, ఆర్థిక రంగంలో యూపీఐ, డిజిటల్ బ్యాంకింగ్, చిన్న వ్యాపారాలు ఆన్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా మార్కెట్‌ను చేరుకోవడానికి చౌక డేటా ధరలు ప్రధాన ఆధారం అయ్యాయి.ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత చౌకైన డేటా ధరలు కలిగిన దేశాల్లో ఒకటిగా నిలిచింది. నాణ్యతతోపాటు చౌకదనం కలిపి ఇంటర్నెట్‌ను సామాన్యుని జేబులోకి తీసుకువచ్చిన దేశంగా భారత్ ప్రపంచం ముందు నిలుస్తోంది. మోదీ పాలనలో డేటా ధరల్లో వచ్చిన ఈ భారీ తగ్గుదల కోట్లాది భారతీయుల జీవన విధానాన్ని, అవకాశాలను మార్చిన నిజమైన డిజిటల్ విప్లవం. చౌకైన, నాణ్యమైన ఇంటర్నెట్ దేశంలోని చివరి వ్యక్తి వరకు అందుబాటులోకి వచ్చిన ఈ ప్రయాణం భారత్‌ను ప్రపంచ డిజిటల్ శక్తిగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

## ఆయిల్ సంక్షోభానికి చెక్..

న్యూఢిల్లీ, జూన్ 13 (న్యూస్ పల్స్)పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు.. హార్మూజ్ ఎప్పుడు తెరుచుకుంటుందో అర్థం కావడం లేదు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. ముఖ్యంగా దిగుమతిపై ఆధారపడిన భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు యురోపియన్ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పటికే చమురు ధరలు భారీగా పెరిగాయి. భారత్‌లో గ్యాస్, చమురు ధరలను కేంద్రం పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా దేశంలో చమురు సంక్షోభాన్ని తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో అత్యవసర ఇంధన నిల్వల సామర్థ్యాన్ని 50 శాతం పెంచబోతోంది. ప్రస్తుతం 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉండగా, వాటిని 90 రోజుల వరకు పెంచే దిశగా అడుగులేస్తోంది. ఆయిల్ కంపెనీలను ఫ్యూయల్ కెపాసిటీని పెంచుకోవాలని ఆదేశించనున్నట్లు తెలుస్తోంది.దేశంలోని మొత్తం ఇంధన అవసరాల్లో సుమారు 90 శాతం విదేశాల నుంచి దిగుమతుల ద్వారానే తీరుతోంది. పశ్చిమాసియా ప్రాంతం నుంచి ఎక్కువగా చమురు వస్తోంది. ఆ ప్రాంతంలో ఏర్పడిన సంక్షోభం వల్ల సరఫరా చైన్ దెబ్బతిన్నది. అలాంటి పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ, రవాణా రంగం, పరిశ్రమలు దెబ్బతినకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అని ప్రభుత్వం భావిస్తోంది.ఇంధన నిల్వలను పెంచడం అనేది కేవలం నిల్వల సామర్థ్యం పెంచడం మాత్రమే కాదు. ఇది దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసే వ్యూహాత్మక చర్య. పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. అలాంటి సమయంలో దేశంలో తగినంత నిల్వలు ఉంటే, ధరలు ఎక్కువగా పెరగకుండా నియంత్రించవచ్చు. అలాగే రవాణా రంగం, వ్యవసాయం, పరిశ్రమలు అంతరాయం లేకుండా కొనసాగవచ్చు. దీర్ఘకాలికంగా చూస్తే ఈ చర్య ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుంది. అయితే నిల్వలు పెంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నిల్వ ఖర్చులు భారీగా ఉంటాయి. ఆయిల్ కంపెనీలపై ఈ భారాన్ని ఎలా పంచాలనేది కూడా ముఖ్యమైన అంశం.పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పుడు చమురు సరఫరా ఎప్పుడైనా ప్రభావితం కావచ్చు. భారతదేశం వంటి దిగుమతి ఆధారిత దేశాలకు ఇది పెద్ద సవాల్. అందుకే ప్రభుత్వం ముందస్తుగా నిల్వలు పెంచి, సంక్షోభం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ చర్య ద్వారా దేశం ఆకస్మిక సంక్షోభాలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఇంధన భద్రతపై దృష్టి పెట్టిన ఇతర దేశాలతో సమానంగా భారతదేశం కూడా అడుగులేస్తోంది. దీర్ఘకాలంలో ఇంధన వైవిధ్యీకరణవైపు కూడా అడుగులేయడం మరింత మంచిదని నిపుణుల అభిప్రాయం.పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన నిల్వలను 50 శాతం పెంచే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దేశ ఇంధన భద్రతకు ముఖ్యమైన అడుగు. 60 రోజుల నుంచి 90 రోజులకు నిల్వలు పెంచడం ద్వారా ఆకస్మిక సరఫరా అంతరాయాలను ఎదుర్కోవచ్చు. ఈ చర్య ఆర్థిక స్థిరత్వం, ధరల నియంత్రణ మరియు దేశ భద్రతకు దోహదపడుతుంది.

## హస్తినకు రాములమ్మ...



హైదరాబాద్, జూన్ 13, (న్యూస్ పల్స్)తెలంగాణ కాంగ్రెస్ నేత విజయశాంతి పార్టీ వైపు చూడటం లేదు. పదవిలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ అంతే. కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. కానీ ఎమ్మెల్సీ పదవితో ఆమె సంతృప్తికరంగా లేనట్లు కనపడుతుంది. తన రేంజ్ కు మంత్రి పదవి దక్కాలన్న యోచనలో విజయశాంతి ఉన్నారని చెబుతున్నారు. అందుకే విజయశాంతి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. శాసనమండలి సమావేశాలకు మాత్రమే హాజరవుతూ మొక్కుబడిగా ప్రశ్నలు వేస్తున్నారు. మొన్న జరిగిన శాసనమండలి సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడి మరోసారి విజయశాంతి తన అక్కసును వెళ్లగక్కారు.కాంగ్రెస్ లో త్వరలో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న ప్రచారం ఎప్పటి నుంచో జరుగుతుంది. అయితే అన్ని రకాల అర్హతలున్న తనకు మంత్రి పదవి ఎందుకు దక్కడం లేదన్నది ఆమె సన్నిహితుల వద్ద ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. నిజానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో విజయశాంతి పేరు రావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అసలు విజయశాంతి పేరును ఎవరూ ఊహించ లేదు. ఢిల్లీలో ఉండి మల్లికార్జున ఖర్గేను కలిసినప్పటికీ ఆమె పేరు ఖరారు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎవరూ భావించలేదు. నేరుగా హైకమాండ్ ను కలసి తనకు ఎమ్మెల్సీ పదవిని తెచ్చుకున్న ఘనత విజయశాంతిది. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి అనేక మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నేరుగా రాహుల్ ను కలసి తమకు మంత్రిపదవి ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో రాములమ్మ కూడా హస్తిన బాట పడుతున్నారన్న టాక్ వినపడుతుందిఎమ్మెల్సీ వచ్చిన ఆనందం మాత్రం ఆమెలో కనిపించడం లేదు. తాను మంత్రి పదవికి పూర్తి స్థాయిలో అర్హత కలిగిన నేతనంటూ మరోసారి ఢిల్లీకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈసారి కూడా ఇక్కడి నేతలతో సంబంధం లేకుండా నేరుగా ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ ను కలసి తన మంత్రి పదవి చర్చించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తనకు మంత్రి పదవి ఇస్తే తాను పార్టీకి ఏం చేయదలచుకున్నానో.. కూడా హైకమాండ్ కు నివేదించేందుకు ఒక బ్లూ ప్రింట్ ను కూడా సిద్ధం చేసుకున్నట్లు చెబుతున్నారు. మొత్తం మీద విజయ శాంతి ఎమ్మెల్సీగానే ఊహించని విధంగా అయినప్పుడు మంత్రి కావడంలో పెద్దగా ఎవరూ నోరు వెళ్లబెట్టాల్సిన పనిలేదంటున్నారు సొంత పార్టీ నేతలు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కారానికి గురయింది. అయితే అందుకు తెలంగాణాలో నమోదయిన కేసు కారణమని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. అఫడవిట్ లో కేసు గురించి పేర్కొనకపోవడంతో మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన ఎన్నికల అధికారులు మీనాక్షి నామినేషన్ ను తిరస్కరించారు. అయితే తెలంగాణలో ఆమెపై కేసు నమోదు కాలేదు. కేవలం ఒక కేసులో న్యాయస్థానం సమన్లు మాత్రమే జారీ చేసింది. ఇవన్నీ పక్కన పెడితే అసలు తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పై కేసు ఉన్నట్లు మధ్యప్రదేశ్ బీజేపీ నేతలకు ఉప్పు అందించిందెవరు? అన్నదే ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.మీనాక్షి నటరాజన్ స్ట్రయిట్ ఫార్వార్డ్ నేత. నిరాడంబరంగా ఉంటారు. ఖరీదైన జీవితాన్ని కూడా ఆశించరు. దీపా మున్షీ దాస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మీనాక్షి నటరాజన్ కు తెలంగాణ కాంగ్రెస్ ఇన్ ఛార్జి బాధ్యతలను అప్పగించింది. ఆమె తెలంగాణ కాంగ్రెస్ లో ఇన్ ఛార్జి పదవి తీసుకున్న వెంటనే ఒకే మాట చెప్పారు. పార్టీకి నమ్మకంగా ఏళ్ల నుంచి పనిచేసిన వారికే ప్రథమంగా గుర్తింపు ఉంటుందని, ఎన్నికలకు ముందు వచ్చిన వారికి పదవులు తర్వాత ఇస్తామని నిర్మొహమాటంగా చెప్పారు. దీంతో పాటు ఆమె కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునే ప్రయత్నం జరగలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

## వసతి గృహాలు, విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలి**
**విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించాలి వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు**
**మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి**

నిజామాబాద్, జూన్ 13 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనితీరుపై అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో డైట్ మెనూ పట్టికను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి విద్యా సంస్థలో స్వచ్ఛమైన, రక్షిత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ పడకూదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు.



# అక్రమాస్తుల వేలానికి రంగం సిద్ధం

హైదరాబాద్ జూన్ 13, (న్యూస్ పల్స్) రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ ప్రతియేటా వందలాది మంది ప్రభుత్వ అధికారులను లంచాలు తీసుకుంటూ లేదా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసుల్లో పట్టుకుంటోంది. సోదాల సమయంలో భారీ మొత్తంలో నగదు, బంగారాన్ని, స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, ఇతర విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. అయితే, ఈ ఆస్తులు చివరకు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయా? మళ్లీ సంబంధిత వారికి తిరిగి ఇస్తారా.. ఆ ఆస్తులను ఏం చేస్తారు..? ఎక్కడికి తరలిస్తారు అనే విషయాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.వాస్తవానికి ఏసీబీ సోదాల్లో పట్టుబడిన నగదును నేరుగా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ కట్టించి వేలం వేస్తారు. వీటితో పాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ ఫిక్స్డ్ డిపాజిట్లను కోర్టు ఉత్తర్వుల మేరకు.. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల ద్వారా మూసివేస్తారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు బదలీ చేయిస్తారు.ఒకవేళ అక్రమాస్తుల్లో కబ్జాలు చేసినవి గానీ, ప్రభుత్వ భూములు గానీ ఉంటే ప్రత్యేక చట్టం ద్వారా స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. అధికారుల ఆక్రమాస్తులను వేలం వేసిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు లేవని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి వస్తారు. విధి నిర్వహణలో భాగంగా రూ.100 లంచం తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవు. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారితో పాటు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులను ఏసీబీ అరెస్ట్ చేసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. ఈ సందర్భంగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బినామీ ఆస్తుల వివరాలను కోర్టులో సమర్పిస్తుంది. ఆ తరువాత సంబంధత అధికారికి నోటీసులు జారీ చేసి.. ఆయా ఆస్తులకు సంబంధించిన చట్టబద్ధమైన ఆదాయ వనరులను వివరించాలని కోరుతుంది. సరైన ఆధారాలు సమర్పించకపోతే ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తుందికోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితుడు దోషిగా తేలితేనే అక్రమాస్తులపై తుది చర్యలు ప్రారంభమవుతాయి. లంచాల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను నేరాల ద్వారా కూడబెట్టిన ఆస్తులుగా పరిగణించి ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించవచ్చు. ఇళ్లు, ప్లాట్లు వంటి స్థిరాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉంటుంది. అలా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తారు.ఏసీబీ సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదును ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ నిర్ధారించి కోర్టు అనుమతితో వేలం వేయవచ్చు. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్ డ్ డిపాజిట్లను కూడా చట్ట ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఉన్నతాధికారులను ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఏసీబీ అరెస్టులు చేసింది. వీరిలో కొందరు అధికారులు రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో బయటపడినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు దోషులుగా తేలి, అక్రమాస్తులు వేలం దశకు చేరితే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో అవినీతి అధికారులకు ఇదో హెచ్చరికగా ఉంటుందని పేర్కొంటున్నారు.

## పబ్లిక్ గార్డెన్ టూ లక్డీకాపూల్

### 1.5 కిలోమీటర్ల వై షేప్ లో ఫ్లైఓవర్

హైదరాబాద్ జూన్ 13, (న్యూస్ పల్స్)హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా కోర్ సిటీ పరిధిలోని నాంపల్లి, అసెంబ్లీ, లక్డీకాపూల్ మార్గాల్లో నిత్యం నరకంగా మారుతున్న వాహనాల రద్దీని నియంత్రించడానికి సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. పబ్లిక్ గార్డెన్ నుంచి అసెంబ్లీ వెనుక వైపుగా లక్డీకాపూల్ వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల పొడవున ఆంగ్ల అక్షరం 'జ' (వై) ఆకారంలో నిర్మించ తలపెట్టిన ఈ వంతెనకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ప్రణాళికలు, డిజైన్లను సిద్ధం చేసింది.సాధారణంగా నగరంలో ఫ్లైఓవర్ల నిర్మాణాల సమయంలో ప్రైవేటు ఆస్తుల సేకరణ పెద్ద సవాలుగా మారుతోంది. భూసేకరణ కారణంగా కోర్టు కేసులు, పరిహారం వివాదాలు తలెత్తి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి ఆలస్యం అవుతున్నాయి. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈ ప్రతిపాదిత వంతెనను గరిష్ఠంగా ప్రభుత్వ భూముల్లోనే నిర్మించేలా అధికారులు చాకచక్యంగా ప్లాన్ చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో హెచ్ఎండీఏ ఇప్పటికే సమగ్ర సర్వేను పూర్తి చేసింది. దాదాపు 99 శాతం వరకు ప్రభుత్వ ఆస్తులను కేటాయించింది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్తుల అవసరం ఎక్కువగా లేకుండా, ఎక్కడా వివాదాలకు తావులేకుండా ఈ ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను రూపొందించింది.ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ముందు భాగం నుంచి ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి పబ్లిక్ గార్డెన్ మీదుగా, అసెంబ్లీ వెనుక వైపు నుంచి రైల్వే లైన్ వెంబడి ముందుకు సాగుతుంది. లక్డీకాపూల్ వద్దకు చేరుకోగానే ఈ వంతెన రైల్వే లైన్ మీదుగా ప్రయాణించి లక్డీకాపూల్ జంక్షన్‌ను దాటుతుంది. ఇక్కడే అసలు ఇంజినీరింగ్ అద్భుతం జరగనుంది. జంక్షన్ దాటిన తర్వాత ఈ ఫ్లైఓవర్ రెండుగా చీలిపోతుంది. అంటే 'వై' షేప్‌గా మారుతుంది. ఇందులో ఒక మార్గం నేరుగా మాసబ్ ట్యాంక్ వైపు వెళ్లే రహదారికి, మరో మార్గం ఖైరతాబాద్ వైపు వెళ్లే రహదారికి అనుసంధానం అవుతుంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కంటే ముందే లక్డీకాపూల్ ప్రధాన రహదారిపై ఈ వంతెన ల్యాండ్ అయ్యేలా డిజైన్ చేశారు.హైదరాబాద్–విజయవాడ రహదారికి అనుసంధానంగా ఉండే ఈ కోర్ సిటీ రూట్‌లో భారీ వాహనాల రాకపోకల వల్ల రాత్రి వేళల్లోనూ తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో విధించే ఆంక్షల వల్ల వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కొత్త వంతెన అందుబాటులోకి వస్తే నాంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు ఖైరతాబాద్ లేదా మాసబ్ ట్యాంక్ వైపు సిగ్నల్ ఫ్రీగా వెళ్లవచ్చు. అయితే, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దీనిని పూర్తిగా 'వన్–వే'గా మార్చనున్నారు. నాంపల్లి నుంచి వెళ్లే వాహనాలకు మాత్రమే దీనిపై అనుమతి ఉంటుంది. ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్ నుంచి వచ్చే వాహనాలను దీనిపైకి అనుమతించరు.

## బోధన్ లో కనిపించని షకీల్

నిజామాబాద్, జూన్ 13, (న్యూస్ పల్స్)ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో.. గులాబీ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాలు జోరుగా జరుగుతున్నాయి. మీటింగ్స్‌కు హాజరవుతున్న పార్టీ నేతలంతా ఐక్యతా రాగం ఆలపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు జట్టుగా, కలిసి కట్టుగా సమావేశాల్లో పాల్గొన్ని క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు. ఇక్కడ మొత్తం 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఒక్క బోధన్ మినహా అన్ని చోట్ల సమావేశాల నిర్వహణ పూర్తయింది. చివరికి నియోజకవర్గ ఇన్చార్జ్ లేని బాన్సువాడలోనూ మూడు మండలాలకు ఓ సమావేశం చొప్పున పూర్తి చేశారు. కానీ? మాజీ ఎమ్మెల్యే షకీల్ బాధ్యుడిగా ఉన్న బోధన్‌లో మాత్రం పట్టించుకునే నాధుడే లేడు. అక్కడ అసలు సన్నాహక సమావేశం జరుగుతుందో లేదో కూడా తెలియని గందరగోళ పరిస్థితులు ఉన్నాయట. ఈనెల 1న మీటింగ్ ఉంటుందని ప్రకటించి.. వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు ఉంటుందో తెలియదు. సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీలుకున్న బీఆర్ఎస్ఎక్కడికక్కడ ఇన్చార్జ్‌లను నియమించి రిపోర్టులు తెప్పించుకుంటోంది. బోధన్‌లో మాత్రం సమావేశం జరగకపోవడం, ఇన్చార్జ్ షకీల్ అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులపై గులాబీ బాస్ ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. పార్టీ తరపున నిరసన కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు వచ్చినా.. ఇక్కడ ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క కార్యక్రమం కూడా జరగలేదు. ఈ పరిణామాలు నాయకత్వానికి ఇబ్బందిగా మారడంతో పాటు? పార్టీ క్యాడర్ సైతం నిరుత్సాహంగా ఉన్నట్టు తెలుస్తోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జరిగిన పరిణామాలతో దుబాయ్ వెళ్లిపోయారు షకీల్. అక్కడి వ్యాపారాల్లో బిజీ అయ్యారట. అప్పట్లో ఆయన బోధన్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో మాజీ ఎమ్మెల్యే భార్యే అడపాదడపా పార్టీ వ్యవహారాలను చక్కబెట్టారు. తర్వాత కొన్నాళ్ళకు తిరిగి వచ్చిన షకీల్ ఇక యాక్టివ్ పాలిటిక్స్ చేస్తానని ప్రకటించారు. మళ్లీ ఏం జరిగిందో ఏమో.. తెలియదుగానీ? ఇంకోసారి దుబాయ్ ఫ్లైట్ ఎక్కేశారు. అక్కడి బిజినెస్ వ్యవహారాల్లో బిజీ అయిపోయి ఇక్కడ పార్టీని గాలికొదిలేశారన్నది కేడర్ టాక్. తాజాగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అందరూ పాల్గొంటున్నా.. ఆయన మాత్రం డుమ్మా కొడుతున్నారు. దీంతో? తమ నియోజకవర్గంలో అసలేం జరుగుతోందో అర్థంకాక కారు కేడర్ గందరగోళపడుతోంది. మాజీ ఎమ్మెల్యే కనిపించడం లేదంటూ సొంత పార్టీ కార్యకర్తలే సెటైర్లు వేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని అంటోంది ద్వితీయ శ్రేణి. బోధన్ సభ్యత్వ నమోదు ఇన్చార్జ్‌గా ఉన్న మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు సైతం ఈ అంశంపై కేసీఆర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారట. దుబాయ్‌తో పాటు జిల్లాలోనూ రైస్ మిల్లు బిజినెస్‌లో బిజీగా మారిన షకీల్ మెల్లిగా రాజకీయాలకు దూరం అవుతున్నారా అన్నది కొందరి అనుమానం. ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం వెనుక ఆసక్తి లేకపోవడమేనా..? లేక ఇతర బలమైన కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి. ఇలాంటి చాలా ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందేనన్నది రాజకీయ వర్గాల మాట. కానీ అప్పటి వరకు క్యాడర్ తలోదిక్కు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ పెద్దలదే. బాస్. జర దేఖో హమారా బోధన్ కోఅంటున్న కార్యకర్తల మాటల్ని పార్టీ పెద్దలు ఎంతవరకు పట్టించుకుంటారో చూడాలి.

## నీట్ పరీక్షా సమయం పెంపు

న్యూఢిల్లీ,పీట్ పరీఓఆ సమయాన్ని ఎన్టీఏ అదనంగా 15 నిమిషాలు పెంచింది. మధ్యాహ్నం 2 నుంచి 5.15 గంటల వరకు పరీక్ష వుంటుంది. రఫ్ వర్క్ పేజీలు నాలుగుకు పెరగనుంది. ఎడమ చేతివాటం విద్యార్థులకు అనుకూలంగా బుక్లెట్ డిజైన్ చేసారు. జూన్ 21న జరగనున్న నీట్ రీ?ఎగ్జామ్కు పక్కాగా ఏర్పాట్లు చేసారు.

## ఖమ్మంలో గాయత్రీ రవి టార్గెట్

ఖమ్మం, జూన్ 13, (న్యూస్ పల్స్)ఖమ్మం జిల్లాలో విజిలెన్స్ దాడులు కలకలం రేపుతున్నాయి. మరీ ముఖ్యంగా బీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అలియాస్ గాయత్రి రవికి చెందిన కంపెనీల మీదే వరుసబెట్టి జరుగుతుండటం పొలిటికల్ హాట్ అవుతోంది. ఇదంతా నిజంగానే అక్రమాల వెలికితీత కోసం జరుగుతోందా?? లేక రాజకీయ కక్ష సాధింపులో భాగమా అన్న అనుమానాలు అన్ని వర్గాల్లో పెరుగుతున్నాయట. వరంగల్ జిల్లాకు చెందిన వద్దిరాజు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో గ్రానైట్ వ్యాపారం ఉంది. బీసీ కాపు సామాజిక వర్గానికి చెందిన రవిమొదట్లో కాంగ్రెస్ అభిమానిగానే ఉన్నారు. 2018లో ఆ పార్టీ వరంగల్ తూర్పు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చిందిగానీ విజయం సాధించలేదు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరాక రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు కేసీఆర్. ఆ పదవీకాలం రెండేళ్ళే కావడం, ముగిసిపోవడంతో తిరిగి ఆయనకే రెన్యువల్ చేశారు. ఈ పరిస్థితుల్లో 2024 లోక్‌సభ ఎన్నికల్లో వద్దిరాజును తమ పార్టీ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించాలని అనుకున్నారట కాంగ్రెస్‌లోని కొందరు. అందుకు ఆయన ఒప్పుకోకపోగా బీఆర్ఎస్‌కు అండగా ఉంటున్నారన్న కోపంతో అధికార పార్టీ ఇప్పుడు టార్గెట్ చేసిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి పొలిటికల్ సర్కిల్స్‌లో. కేసీఆర్, హరీష్‌రావు లాంటి అగ్ర నాయకులకు దగ్గరగా ఉండే గాయత్రి రవిని బీఆర్ఎస్‌కు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ క్రమంలోనే కొద్ది రోజులుగా ఆయనకు చెందిన గ్రానైట్ కంపెనీల్లో విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయన్న ప్రచారం నడుస్తోంది.ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని గ్రానైట్ క్వారీల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఇవి ఎక్కడా బయటికి ఎక్స్‌పోజ్ అవకుండా జాగ్రత్త పడ్డారట అధికారులు. మరోవైపు కొంతకాలంగా? ఖమ్మం జిల్లా కారును గాయత్రి రవి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కందాల, సండ్ర వెంకటవీరయ్య కలిసి నడిపిస్తున్నారు. ఇందులో కీలకంగా ఉన్నందునే గాయత్రి రవి టార్గెట్ అయ్యారా అన్న అనుమానాలు కూడా చాలామందికి ఉన్నాయట. జిల్లాలో ఉన్న ముఖ్యమైన ప్రతిపక్ష నాయకులు ఒక్కొక్కరిని టార్గెట్ చేసేలా అధికార పార్టీ పావులు కదుపుతోందన్నది బీఆర్ఎస్ అభిప్రాయం. అటు గతంలో కాంగ్రెస్ నేతలకు అత్యంత ఆప్తుడిగా ఉండేవారు రవి. ప్రస్తుతం రాష్ట్రంలో కీలక మంత్రిత్వ శాఖను నిర్వహిస్తున్న ఒక మినిస్టర్‌కు అప్పట్లో రైట్ హ్యాండ్‌లా ఉండేవారాయన. ఇప్పుడు తనకు ఎదురవుతున్న సమస్యలు, వేధింపుల గురించి వద్దిరాజు రవిచంద్ర సదరు మంత్రికి చెప్పుకున్నా నా చేతిలో ఏమీ లేదని ఆయన అన్నట్టు తెలిసింది. మరోవైపు వచ్చే అసెంబ్లీ? ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యే సీట్లో రవి పోటీ చేస్తారన్న ప్రచారం సైతం ఉంది. ఇక ఆయన గ్రానైట్ క్వారీలతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బంధువులు నిర్వహిస్తున్న దుకాణ సముదాయానికి కూడా అధికారులు నోటీసులు ఇచ్చారట. వాటి వెనుక సైతం అధికార పార్టీ నేతల వత్తిడి ఉందని ఆఫ్ ద రికార్డ్‌లో అజయ్ అంటున్నారట. అయితే దాన్ని ఇష్యూ చేయడం వల్ల వచ్చే ప్రయోజనం కూడా ఏమీ ఉండదన్నది ఆయన అభిప్రాయం. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లా పాలిటిక్స్‌లో అజయ్ వర్సెస్ గాయత్రి రవి అన్నట్టుగా కూడా వ్యవహారాలు నడిచాయి. ఆ సంగతి ఎలా ఉన్నా ప్రస్తుతం నడుస్తున్న విజిలెన్స్ వ్యవహారాలను గాయత్రి రవి ఎలా ఎదుర్కొంటారోనని చూస్తున్నాయి రాజకీయవర్గాలు.

## భారత ఆర్మీ నూతన చీఫ్‌గా ధీరజ్ సేత్.. ఈ నెల 30న బాధ్యతల స్వీకారం

భారత సైన్యం లో అత్యున్నత పదవి అయిన ఆర్మీ చీఫ్ గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియమితులయ్యారు. ప్రస్తుత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది (జజూవనిటతీజీ ఆలితిలవటతి) పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో 2026 జూన్ 30 నుంచి ధీరజ్ సేథ్ భారత సైన్యాధిపతిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం శనివారం అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రపతి ఆమోదంతో ఈ నియామకం జరిగినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆయన పదవీకాలం ఆగస్టు 31 2028 వరకు కొనసాగనుంది.ప్రస్తుతం ఆర్మీ వైస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేస్తున్న ధీరజ్ సేథ్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సైనిక సేవా అనుభవం ఉంది. ఖడక్‌వాస్లాలోని జాతీయ రక్షణ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఆయన 1986లో ఆర్మర్డ్ కార్ప్స్ అధికారిగా భారత సైన్యంలో చేరారు. అప్పటి నుంచి వివిధ కీలక కమాండ్, స్టాఫ్, వ్యూహాత్మక బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. సైనిక విద్యలోనూ ఆయనకు విశేష అనుభవం ఉంది. ఫ్రాన్స్‌లోని పారిస్ మిలిటరీ కాలేజీలో డిఫెన్స్ సర్వీసెస్ కమాండ్ అండ్ జనరల్ స్టాఫ్ కోర్సు పూర్తిచేశారు.అదేవిధంగా అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న నావల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కూల్‌లో ఇంటర్నేషనల్ డిఫెన్స్ అక్విజిషన్ మేనేజ్‌మెంట్ కోర్సులో శిక్షణ పొందారు. ధీరజ్ సేథ్ ఎడారి ప్రాంతాల్లో సాయుధ రెజిమెంట్‌కు, అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో సాయుధ బ్రిగేడ్‌కు నాయకత్వం వహించారు. జమ్మూ–కాశ్మీర్‌లో తిరుగుబాటు నిరోధక దళానికి కమాండర్‌గా సేవలందించారు. అనంతరం సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు నాయకత్వం వహించి ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా కీలక జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలను పర్యవేక్షించారు.గత ఏడాది నిర్వహించిన 'ఆపరేషన్ సింధూర్' సమయంలో పూణే కేంద్రంగా ఉన్న సదరన్ కమాండ్‌కు ఆయన నాయకత్వం వహించారు. అనంతరం పశ్చిమ సరిహద్దు వెంబడి నిర్వహించిన త్రివిధ దళాల సంయుక్త విన్యాసాలను సమన్వయం చేశారు. అంగోలాలోని ఐక్యరాజ్యసమితి శాంతి భద్రతా మిషన్‌లోనూ ఆయన సేవలందించారు.



## ఇన్ యాక్టివ్ గా మారిన బండి



కరీంనగర్ జూన్ 13, (న్యూస్ పల్స్)కొడుకు మీద ఫోక్సో కేసు నమోదైన తర్వాత కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాజకీయంగా అంత యాక్టివ్ గా లేరు. పైగా ఆయన తీవ్ర నిరాశలో కనిపిస్తున్నారు. ఒకప్పటి మాదిరిగా ప్రత్యర్థుల మీద ఆయన ఆగ్రహం గా ఉండడం లేదు. తీవ్రస్థాయిలో మాట్లాడటం లేదు. కార్యకర్తలను కలుస్తున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారు. ఆ తర్వాత ఢిల్లీ లేదా హైదరాబాద్ వెళ్ళిపోతున్నారు. అత్యంత సన్నిహితులకు మాత్రమే ఆయన దగ్గరగా ఉంటున్నారు.కొద్దిరోజుల క్రితం బండి సంజయ్ ఆ మాత్రం కూడా అందుబాటులో లేకుండా పోయారు. సన్నిహితులకు కూడా ఆయన సమాచారం తెలియదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కి ఏమైంది.. ఆయన ఏమైపోయారు.. ఉన్నట్టుండి అజ్ఞాతంలోకి ఎందుకు వెళ్లిపోయారు అనే చర్చ నడిచింది. ఇక నమస్తే తెలంగాణ అయితే బండి సంజయ్ మీద టన్నులకొద్దీ బురద కథనాలు రాయడం మొదలుపెట్టింది. అయితే బండి సంజయ్ ఎట్టకేలకు బయటికి వచ్చారు. తాను ఎందుకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయానో వివరించారు.బండి సంజయ్ అజ్ఞాతంలోకి వెళ్లలేదు. ఎవరికీ కనిపించకుండా పోలేదు. ఆయన అనారోగ్యానికి గురయ్యారు. కల్తీ పాలు తాగడం వల్ల ఆయన ఆరోగ్యం పాడైంది. దీంతో ఆయన చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. గర్జన 20 సంవత్సరాలుగా బండి సంజయ్ కానీ దగ్గు లేదా జ్వరంతో కూడా బాధపడలేదు. హైదరాబాద్ నగరంలో కల్తీ పాలు తాగడం వల్ల ఐదు రోజులు ఆయన మంచానికే పరిమితమయ్యారు. ఇదే విషయాన్ని ఆయన కరీంనగర్ జిల్లా జమ్మికుంట లోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ రైతు సమ్మేళనంలో వెల్లడించారు.రైతులు రసాయన ఎరువులకు దూరంగా ఉండాలని.. ప్రకృతి సిద్ధ మీద దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సేంద్రీయ సాగుతో రైతుల కోటీశ్వరులు కావచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతులను ప్రకృతిసిద్ధమైన ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు 10,000 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయడాన్ని బండి సంజయ్ అభినందించారు.ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలో కల్తీ ఆహార పదార్థాల వినియోగం పెరిగిపోయింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహిస్తున్న దాడులలో ఈ విషయాలు వెలుగుచూస్తున్నాయి. చివరికి కేంద్రమంత్రి కూడా కల్తీ పాల వల్ల అనారోగ్యానికి గురి కావడం ఆందోళన కలిగిస్తోంది.

## వనస్థలిపురంలో అక్రమ లింగ నిర్ధారణ రాకెట్ భగ్నం

### హయగ్రీవ హాస్పిటల్‌పై డికాయ్ ఆపరేషన్

### – డైరెక్టర్ సహా ముగ్గురు అరెస్ట్

### చట్టం కింద కేసు

– హైదరాబాద్: వనస్థలిపురం పరిధిలోని హయగ్రీవ హాస్పిటల్‌లో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు డికాయ్ ఆపరేషన్ నిర్వహించి రాకెట్‌ను ఛేదించారు. ఈ కేసులో హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు, రిసెప్షనిస్ట్ లోకేష్‌తో పాటు తుక్కుగూడ శ్రీ సాయి ధనుష్ క్లినిక్ ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు.వనస్థలిపురం పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మహిళా పోలీసును డికాయ్‌గా హయగ్రీవ హాస్పిటల్‌కు పంపారు. హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు, రిసెప్షనిస్ట్ లోకేష్ ఇద్దరూ కలిసి లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తామని హామీ ఇచ్చారు. తమకు తెలిసిన తుక్కుగూడ వద్ద ఉన్న విజయ్ కుమార్ స్కాన్ చేసి పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అని చెబుతాడని రిఫర్ చేశారు.దీంతో పోలీసులు వెంటనే తుక్కుగూడ వద్ద శ్రీ సాయి ధనుష్ క్లినిక్‌లోని ల్యాబ్‌పై దాడి చేశారు. అక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల హెచ్చరిక: ఖఅఖఔఆ చట్టం ప్రకారం గర్భంలోని శిశువు లింగాన్ని తెలియజేయడం నేరం. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం పోలీసులు హెచ్చరించారు. ఆడపిల్లల లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అక్రమ లింగ నిర్ధారణలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# జిల్లా మంత్రులు ఇద్దరు అసమర్థులే : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



నల్గొండ : జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులు అసమర్థులేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. జిల్లాకు సీఎం ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదని, నిధుల సాధనలోనూ జిల్లా మంత్రులు విఫలం చెందారని దుయ్యబట్టారు.నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ఓటర్ జాబితా పరిశీలన (ఎస్ఐఆర్), పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బీఆర్ఎస్ బూత్ ఏజెంట్లు ప్రతి రోజు బీఎల్‌వోతో పాటే ఇల్లులు తిరుగుతూ అన్ని పరిశీలించాలని సూచించారు.అందరి ఓట్లు కాపాడేలా పకడ్బందీగా పని చేయాలని,అనుమానం వస్తే వెంటనే ఆర్డీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేయాలని సూచించారు.ఈ నెల 17న పెద్ద స్కామ్ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నల్గొండకు వస్తున్నాడని తెలిపారు. హ్యాంరోడ్లు అన్ని వట్టివేనని, కమిషన్ల కోసమే హంగామా సృష్టిస్తున్నారని విమర్శించారు. కోతల వెంకట్ రెడ్డి ప్రజలను మోసం చేసేందుకు డ్రామాలు అడుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ నల్గొండకు వచ్చిన ప్రతిసారి నిధులిచ్చి అభివృద్ధి చేశారని , మెడికల్ కాలేజీలు, భగీరథ పథకం, రూ.1300 కోట్లతో నల్గొండ పట్టణం అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.అయితే ఇద్దరు మంత్రులు స్కామ్ లు, మిల్లర్ల వద్ద మూడుపులు తీసుకుంటూ చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు.పోయేలా ఉన్న మంత్రి పదవిని కాపాడుకునేందుకు కోమటిరెడ్డి రేవంత్‌ను కాకా పెట్టేందుకు సభ పెడుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు.తన తమ్ముడికి పదవి వచ్చి తన పదవి పోయేలా ఉందని,అందుకే హడావుడి చేస్తూ షో పుటప్ చేస్తున్నారని విమర్శించారు.ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వాల జిల్లా ఇన్‌చార్జి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ , ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, డా.గాదరి కిశోర్ కుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి ,కంచర్ల కృష్ణారెడ్డి , బూత్ లెవల్ ఏజెంట్ లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల సంఖ్య పెంచాలి : మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

రామగిరి, జూన్ 13 : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం పాఠశాలల సంఖ్యను పెంచాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శనివారం టీఎస్ యూటీఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసా చారి అధ్యక్షతన యూటీఎఫ్ భవన్ లో జరగగా అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూటీఎఫ్ కార్యకర్తలు ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు పెంచడానికి కృషి చేయాలన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేడు పాలనలో, ప్రతిపక్షంలో ఉన్న మూడు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రభుత్వ బడుల మూసివేతపై నోరు మెదపడం లేదని ఆరోపించారు. పారిశ్రామికరణ, పట్టణీకరణ మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువ దంపతుల వలసలతో నగరాలలో పెరిగిన జనాభాకు అనుగుణంగా నేడు ప్రభుత్వ బడులు లేవని, జనాభా పెరుగుదలకు అనుగుణంగా నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్, చండూరు లాంటి పట్టణ ప్రాంతాలలో ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ బడులు ఏర్పాటు చేయాలని సీఎంను డిమాండ్ చేశారు.నల్లగొండ పట్టణంలో 44 వేల మంది విద్యార్థులు చదువుతుండగా అందులో కేవలం ఒక 5,000 మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, నల్లగొండ పట్టణంలో బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసిన విధంగానే కేశరాజు పల్లి, రామగిరి, జేబీఎస్, అక్కలాయి గూడెం పాఠశాల అభివృద్ధి చేస్తే పట్టణ ప్రాంతంలో ఆర్థికంగా వెనకబడిన ఎంతో మందికి, మధ్య తరగతి వర్గానికి సౌకర్యంగా ఉంటుందని అందుకు స్థానిక మంత్రి చొరవ చూపాలని కోరారు. డిప్యూటేషన్ ల దుమారంపై ఆయన స్పందిస్తూ టీచర్ల సర్దుబాటు విద్యార్థుల సౌకర్యార్థం ఉండాలని, ఉపాధ్యాయుల వ్యక్తిగత అవసరాల కోసం కాదని ఇలాంటి అశాస్త్రీయ డిప్యూటేషన్లు పూర్తిగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నల్లగొండ జిల్లా కమిటీ అక్రమ డిప్యూటేషన్ రద్దు కోసం ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంటుందని, అవసరమైతే తాను అక్రమ డిప్యుటేషన్ల రద్దుకై ప్రజలను సైతం సమీకరించనున్నట్లు చెప్పారు.




తెలంగాణ ప్రభుత్వ అప్పులుటీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలని, ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా షూస్ లతో కూడిన కిట్టును అందించాలని, నల్లగొండ జిల్లాలో మంజూరైనటువంటి 124 ప్రీ ప్రైమరీ సెక్షన్లకు అవసరమైన ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ ద్వారా నింపాలని, ప్రభుత్వం హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విధివిధానాలను రూపొందించి తక్షణమే అమలు పరచాలన్నారు. పీఆర్‌సీ నివేదికను తెప్పించుకుని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు జులైలో నెలలో ప్రమోషన్లు బదిలీల ప్రక్రియ చేపట్టాలని, రెగ్యులర్ ఎంఈఓ, డిప్యూటీ డీఓ, డీఓలను నియమించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఒకేసారి అల్పాహారం పథకం ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి జి నాగమణి, ఎడ్ల సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు జి.అరుణ, జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, నలపరాజు వెంకన్న, భాను ఆడిట్ కమిటీ సభ్యులు భాను ప్రకాష్, మధుసూదన్, వివిధ కమిటీల కన్వీనర్లు పగిడిపాటి నరసింహ, ప్రభాకర్, బి.సురేందర్ రెడ్డి, ఎరనాగుల సైదులు, శ్యాం కుమార్, శ్రీలత, వరలక్ష్మి, రాగి రాకేశ్, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

# యుద్ధం ముగించే సమయం ఆసన్నమైంది.. నెతన్యాహుకు ఫోన్‌లో చెప్పిన డొనాల్డ్ ట్రంప్




ఇరాన్ తో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడుడొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కేవలం మరికొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశం ఉందని ఆయనకు తెలిపినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. 'ఇది మంచి ఒప్పందం.. యుద్ధాన్ని ముగించే సమయం వచ్చేసింది' అని నెతన్యాహుకు ట్రంప్ చెప్పినట్లు సమాచారం.అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు తుదిదశకు చేరుకున్నాయని ఇరుదేశాల అధికారులు చెబుతున్నారు. గతంలో ఇరాన్‌లో పాలన మార్పే లక్ష్యమని వాదించిన నెతన్యాహు.. ఇప్పుడు ట్రంప్ ముందుకు తీసుకెళుతున్న ఒప్పందాన్ని అడ్డుకోలేమనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమంపై ఇజ్రాయెల్ ఆందోళనలను ఒప్పందంలో పరిగణనలోకి తీసుకుంటారని ట్రంప్‌పై తనకు నమ్మకం ఉందని ఆయన చెప్పినట్లు అధికారులు వెల్లడించారు.అయితే ప్రతిపాదిత ఒప్పందంపై ఇజ్రాయెల్ పూర్తిగా సంతృప్తిగా లేదని సమాచారం. ఆంక్షల సడలింపుతో ఇరాన్ చమురు విక్రయాలు పెంచుకొని ఆర్థికంగా బలపడొచ్చని, అదే సమయంలో అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయకపోవచ్చని ఇజ్రాయెల్ వర్గాలు భావిస్తున్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి కాట్జ్ మాట్లాడుతూ.. అమెరికా తన ప్రయోజనాల దృష్ట్యా ఒప్పందం కుదుర్చుకుంటున్నప్పటికీ ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణులు, అనుబంధ తీవ్రవాద సంస్థల విషయంలో తమ భద్రతా ఆందోళనలు కాపాడాలని ఆశిస్తున్నామని చెప్పారు.న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం అమెరికా-ఇరాన్ మధ్య త్వరలో ఓ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరే అవకాశం ఉంది. ఇందులో 60 రోజుల కాల్పుల విరమణ, ఇరాన్‌పై ఆంక్షల సడలింపు, అణు కార్యక్రమంపై తదుపరి చర్చలకు మార్గం సుగమం చేసే అంశాలు ఉండనున్నాయి. అలాగే హర్మూజ్ జలసంధిని తిరిగి పూర్తిగా తెరవడం, ఇరాన్ పోర్టులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది.

# బంగారం మెరిపిస్తామంటూ.. క్షణాల్లోనే మాయం చేసిన కేటుగాళ్లు..!



తొగుట: బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ దొంగలు, మోసగాళు కూడా కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. మీ బంగారు ఆభరణాలను కొత్తవాటిలా మెరిపిస్తాం.. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా శుభ్రం చేస్తాం అంటూ ఇంటి గుమ్మం తట్టిన ఇద్దరు కేటుగాళ్లు అమాయక మహిళను నమ్మించి క్షణాల్లో 9 గ్రాముల బంగారాన్ని కాజేసిన ఘటన మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో కలకలం రేపింది.శనివారం ఉదయం గ్రామంలోకి వచ్చిన ఇద్దరు యువకులు తమ వద్ద ఉన్న పౌడర్, రసాయన ద్రావణాలను చూపిస్తూ బంగారం, వెండి ఆభరణాలను మెరిపిస్తామని ప్రచారం చేశారు. మొదట పలువురు వారి మాటలను నమ్మకపోయినా, గ్రామానికి చెందిన కళ్లెపు అనూష ఇంటి వద్దకు చేరుకున్న వారు తమ మాయమాటలతో ఆమెను నమ్మించారు.ముందుగా ఆమె చేతులపై పౌడర్ వేసి చల్లదనాన్ని అనుభూతి చెందేలా చేసి, తమ వద్ద ఉన్న పదార్థాలు నిజంగానే పనిచేస్తాయని నమ్మించారు. అనంతరం ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడు, ఆమె చెల్లి కాళ్లలోని వెండి పట్ట గొలుసులను తీసుకుని ప్రత్యేక లిక్విడ్‌లో శుభ్రం చేస్తామని చెప్పారు.అయితే ఆ ప్రక్రియలోనే అత్యంత చాకచక్యంగా బంగారంలో కొంత భాగాన్ని కరిగించి, మిగిలిన ఆభరణాలను తిరిగి అప్పగించి అక్కడి నుంచి పరారయ్యారు. కొద్దిసేపటికే ఆభరణాల బరువు తగ్గినట్లు అనుమానం రావడంతో స్థానిక బంగారు దుకాణంలో తూకం వేయించగా సుమారు 9 గ్రాముల బంగారం మాయమైనట్లు తేలింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు షాక్‌కు గురై లబోదిబోమంటూ విలపించారు.ఈ ఘటన గ్రామంలో తీవ్ర ఆందోళనకు దారితీసింది. బంగారం మెరిపిస్తామంటూ, శుభ్రం చేస్తామంటూ ఇంటింటికి తిరిగే అపరిచితులను నమ్మవద్దని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. బంగారం ధరలు పెరిగిన నేపథ్యంలో ఇలాంటి మోసాలు మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.ఘటనపై సమాచారం అందుకున్న తొగుట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ఈ కేటుగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు."అపరిచితుల మాయమాటలు నమ్మితే.. క్షణాల్లో కష్టార్జితం కరిగిపోతుంది" అంటూ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

# వరుస విజయాలతో దేశ రక్షణ రంగంలో డీఆర్‌డీఓ సరికొత్త చరిత్ర




న్యూ ఢిల్లీ, దేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా భారత రక్షణ పరిశోధనా, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) కీలక మైలురాయిని అధిగమించింది. ఈ నెల 10, 11 తేదీల్లో చేపట్టిన మూడు అత్యంత ప్రాధాన్యమైన క్షిపణి పరీక్షలు విజయవంతం కావడంతో దేశ రక్షణ రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించింది. బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్(బీఎండీ) వ్యవస్థ, యాంటీ-షిప్ వార్‌ఫేర్ సామర్థ్యాలు, సుదూర లక్ష్యాలను నిర్వీర్యం చేయడంలో దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది భారత్.డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన ఇంటర్‌సెప్టర్ క్షిపణులు సుదూరం నుంచి వచ్చే బాలిస్టిక్ క్షిపణులను గగనతలంలోనే గుర్తించి ధ్వంసం చేసే సామర్థ్యాన్ని విజయవంతంగా ప్రదర్శించాయి. దీంతో అత్యాధునిక బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థను సమర్థంగా నిర్వహించగల దేశాల సరసన నిలిచింది భారత్. దేశ భద్రతకు సవాలుగా మారే సుదూర క్షిపణి ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యం భారత రక్షణ వ్యవస్థకూ ఉందని దీంతో స్పష్టమైంది. ఇక.. యాంటీ-షిప్ యుద్ధ సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో అభివృద్ధి చేసిన నావల్ యాంటీ షిప్ మిసైల్-మీడియం రేంజ్(ఎన్ఏఎస్ఎం-ఎంఆర్) తొలి ప్రయోగ పరీక్ష కూడా విజయవంతమైంది. సముద్రంలో శత్రు యుద్ధనౌకలను కచ్చిత లక్ష్యంగా దాడిచేసే సామర్థ్యాన్ని ఈ క్షిపణి ప్రదర్శించింది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ దేశ నౌకాదళాన్ని మరింత బలోపేతం చేయనుంది.మూడు కీలక పరీక్షలు వరుసగా విజయవంతం కావడం డీఆర్‌డీఓ సైంటిస్ట్‌ల ప్రతిభకు నిదర్శనమని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో మరింత పురోగతి సాధించే దిశగా భారత్ దూసుకెళ్తోందని వెల్లడించాయి. ఈ విజయాలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, భారత సాయుధ దళాలు, ఈ ప్రాజెక్టుల్లో భాగస్వాములైన వారందరినీ ఆయన అభినందించారు. దేశ భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా ఈ విజయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.


# అసోంలో కూలిన ఐఏఎఫ్ ఏఎన్-32 విమానం.. ఐదుగురి మృతి



అస్సాంలోని జోర్హాట్ రౌరియా విమానాశ్రయంలో భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 విమానం కూలిపోయింది. ఈ ఘటనలో పైలట్ సహా ఐదుగురు మృతిచెందినట్టు అధికారులు వెల్లడించారుప్రాథమిక సమాచారం ప్రకారం.. ఎగువ అస్సాంలోని వ్యూహాత్మకంగా ముఖ్యమైన వైమానిక స్థావరం సమీపంలో ఈ ప్రమాదంలో జరిగినట్టు అధికారులు భావించారు. విమానాన్ని ల్యాండ్ చేసేందుకు యత్నిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం అనంతరం విమానంలో మంటలు చెలరేగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనాస్థలం నుంచి దట్టమైన పొగలు ఎగసిపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సమాచారం అందుకున్న రక్షణ సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టారు.ఇది 1980లలో అభివృద్ధి చేసిన సోవియట్ కాలంనాటి డబుల్ ఇంజిన్ టర్బోప్రాప్ రవాణా విమానం. ప్రస్తుతం భారత వైమానిక దళంలో సుమారు 105 ఏఎన్-32 విమానాలు సేవలందిస్తున్నాయి. వీటిలో 35 విమానాలను ఉక్రెయిన్‌కు చెందిన సంస్థ ద్వారా ఆధునికీకరించగా, మిగిలిన వాటిని దేశీయంగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. అయితే.. ఈ విమానాలు పాతబడుతుండటంతో వీటి స్థానంలో కొత్తవాటిని సమకూర్చుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భారత వైమానిక దళం(ఎంఈ) కోసం అలాంటి విమానాలను సుమారు 60 వరకు కొనుగోలు చేసే అవకాశముంది. దీనికి రక్షణ సేకరణ మండలి(ఆంఅ), భద్రతా కేబినెట్ కమిటీ(అఆూ)ల ఆమోదం పొందాల్సి ఉంటుంది.

# అభిషేక్ నా కొడుకు లాంటివాడు.. కల్యాణ్ బెనర్జీ యూటర్న్

కోల్‌కతా: టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎవరికీ గౌరవం ఇవ్వడం లేదని, ఆయన కావాలో, తాను కావాలో తేల్చుకోండంటూ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అల్టిమేటం ఇచ్చిన ఆ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు యూటర్న్ తీసుకున్నారు. 'అభిషేక్ నా కొడుకుతో సమానం. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుంది' అని అన్నారు.సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్ తరఫున కల్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు.



ఈ కేసులో అరెస్టు నుంచి అభిషేక్ బెనర్జీకి హైకోర్టు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. అయితే ఈ కేసులో కల్యాణ్ బెనర్జీ స్థానంలో మరొక లాయర్ వచ్చి చేరడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అభిషేక్ అహంకారిగా మారిపోయాడని, ఎవరినీ గౌరవించడం లేదని, అభిషేక్ లేకుండా పార్టీ నడవదని మమతా బెనర్జీ భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకుంటానని ఆయన హెచ్చరించారు. దీనిపై అభిషేక్ ఆచితూచి స్పందించారు. కల్యాణ్ బెనర్జీ తనకంటే పెద్దవారని, ఆయన తన అభిప్రాయాలను చెప్పడంలో తప్పులేదని, చిన్నప్పటి నుంచి తనను ఆయన చూశారని, ఆయన గురించి తాను ఏమీ మాట్లాడలేనని అన్నారు. ఈ క్రమంలో అభిషేక్ తన కుమారుడి లాంటివాడని కల్యాణ్ బెనర్జీ ప్రకటించడంతో టీఎంసీ అధినాయకత్వం ఊపిరి పీల్చుకుంది.కాగా, కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందంటూ కొందరు చేస్తున్న ఊహాగానాలను కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు తోసిపుచ్చారు. కాంగ్రెస్‌లో టీఎంసీ కలవబోవడం లేదని చెప్పారు. రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కలుస్తారంటూ వస్తున్న వార్తలపై సూచిగా స్పందించారు. 'వాళ్లు ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చు. బీజేపీ గొడుకు కింద పనిచేయాలనుకుంటున్నారు. ఇదంతా ఓ కుట్ర. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీతో పనిచేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు.

# ఆర్మీ ఆఫీసర్‌నని చెప్పుకుంటూ బురిడీ కొట్టిస్తున్న యువకుడి అరెస్టు

న్యూ ఢిల్లీ, తాను సైనిక అధికారినని చెప్పుకుంటూ జనాల్ని బురిడీ కొట్టిస్తున్న ఒక 21 ఏళ్ల యువకుడికి ఆర్మీ చెక్ పెట్టింది. అతడి కోసం వల పన్ని అరెస్టు చేసింది. యూపీలోని షాజహాన్‌పూర్‌లో తాజాగా ఈ ఘటన వెలుగు చూసింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఆర్యన్ వర్మ అనే యువకుడు నీట్ ఎగ్జామ్‌లో పలుమార్లు విఫలమయ్యాడు. ఆ తరువాత ఆర్మీలో బ్రిగేడియర్‌నని చెప్పుకుంటూ తిరగడం ప్రారంభించాడు. అధికారిక కార్యక్రమాల్లో వినియోగించే యూనిఫామ్‌ను ధరించి జనాల్ని బురిడీ కొట్టించేవాడు. జనాల్ని నమ్మించేందుకు ఒక ఎస్‌యూవీ కూడా వాడేవాడు. తన వెంట ఇద్దరు బాడీ గార్డులను తెచ్చుకునే అతడు వారిని ఎన్ఎస్‌జీ కమాండోలుగా జనాలను పరిచయం చేస్తుండేవాడు.ఆర్యన్‌పై ఫిర్యాదులు అందడంతో ఆర్మీ అధికారులు రంగంలోకి దిగారు. అతడిని అరెస్టు చేసేందుకు ఏప్రిల్‌లో ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించారు. ఈ క్రమంలో కొందరు ఆర్మీ అధికారులు సాధారణ పౌరుల్లా అతడిని సంప్రదించారు. కంటోన్‌మెంట్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతను ఉద్దేశించి ప్రసంగించాలని అన్నారు. దీంతో, ఆర్యన్ కార్యక్రమానికి ఆర్మీ యూనిఫామ్ ధరించి హాజరయ్యాడు. ఎస్‌యూవీ కారులో, ఇద్దరు బాడీ గార్డులను తీసుకొచ్చాడు.

# తాటి చెట్టు కూలి మహిళ మృతి

రంగారెడ్డి ,రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది.భారీ ఈదురుగాలులకు తాటి చెట్టు కూలిపడి ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు.సభావత్ లక్ష్మి తన కుమారుడు వెంకట్ రామ్, కోడలు లలితతో కలిసి రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఓ రేకుల ఇంట్లో అద్దెకు నివాసం ఉంటున్నారు.వీరంతా వికలాంగులేనని స్థానికులు తెలిపారు.నిన్న రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో బలమైన ఈదురుగాలులు వీచడంతో ఇంటి పక్కనే ఉన్న తాటి చెట్టు ఒక్కసారిగా కూలి, ఇంట్లో నిద్రిస్తున్న లక్ష్మి కుటుంబ సభ్యులపై పడింది.

# ఏపీలో 6, తెలంగాణలో 4..

## మూడు ముక్కలుగా లోక్‌సభ నియోజకవర్గాలు

విజయవాడ, జూన్ 13,దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తాజాగా నియోజకవర్గాల పునర్విభజన అంశానికి సంబంధించి కీలక ప్రతిపాదనలతో సిఫార్సులు చేసింది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 824 నియోజకవర్గాలకు పెంచాలని పేర్కొంది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ప్రస్తుతం ఉన్న 543 నియోజకవర్గాలలోని 59 స్థానాలను రెండుగా, 111 స్థానాలను మూడు నియోజకవర్గాలుగా విభజించాలని సూచించింది. నియోజకవర్గాల విభజనకు.. గత ఎన్నికల్లో పోలింగ్ శాతంతో పాటుగా పట్టణ, ఎస్సీ, ఎస్టీ, మహిళల జనాభా సహా పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచనలు చేసింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలు నియోజకవర్గాలు మూడుగా, రెండుగా విభజించాలని సూచించింది.ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, రాజంపేట, కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల నియోజకవర్గాలను మూడుగా, మచిలీపట్నం నియోజకవర్గాన్ని రెండుగా చేయాలని సూచించింది. తెలంగాణ విషయానికి వస్తే.. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కా?జ్‌గిరి, మెదక్‌లను మూడుగా, చేవెళ్లను రెండుగా విభజించాలని సిఫార్సు చేసింది. దీని ప్రకారం నియోజకవర్గాలను విభజన వల్ల 2.32% ఓటింగ్ పెరుగుతుందని.. 2.23 కోట్ల మంది అదనంగా ఓటేస్తారని చెబుతున్నారు. తాజా సిఫార్సుల్ని బట్టి నియోజకవర్గాలను విభజిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 3.52%, తెలంగాణలో 6.55% ఓటింగ్ పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు. జనాభా, పట్టణీకరణ, ఎస్సీ జనాభా, ఎస్టీ జనాభా, భాషాపరమైన పోలరైజేషన్, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి మూడుగా విభజించే లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆరు నగరాలు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ నియోజకవర్గం భాషాపరమైన పోలరైజేషన్ స్కోర్ 0.12 ఉంది. హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉర్దూ మాట్లాడేవారు 10.66 లక్షలమంది ఉన్నారు.. తెలుగు మాట్లాడేవారు 28శాతం, హిందీ మాట్లాడేవారు 5.15శాతం ఉన్నారు. ఈ మేరకు హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని సిఫార్సు చేసింది. ఇలా భాషాపరమైన పోలరైజేషన్ ఉన్నచోట్ల ఓటింగ్ శాతం 11 నుంచి 13 శాతం అధికంగా నమోదవుతుందని భావిస్తున్నారు.. ఇక సికింద్రాబాద్‌లో పోలరైజేషన్ స్కోర్ (0.120)గా ఉంది. హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే.. ప్రతి నియోజకవర్గంలో 27.87 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. సికింద్రాబాద్‌ను మూడుగా విభజస్తే 26.93 పర్సంటేజ్ పాయింట్లు వస్తాయని భావిస్తున్నారు.ఏపీ విషయానికి వస్తే.. నంద్యాల (0.117), రాజంపేట (0.114), కడప (0.105), విశాఖపట్నం (0.052) పోలరైజేషన్ ఉంది. విశాఖపట్నం నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే 15.88 పర్సంటేజ్ పాయింట్లు, కడప నియోజకవర్గం విభజనతో 15.39 పర్సంటేజ్ పాయింట్లు, రాజంపేట 14.47 పర్సంటేజ్ పాయింట్లు, నంద్యాల 14.22 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల ప్రకారం పెద్ద రాష్ట్రాల్లో సీట్లు 50శాతం పెరగనున్నాయి. చిన్న రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను నేరుగా రెట్టింపు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణ లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు, కర్ణాటక సీట్లు 28 నుంచి 42కు, తమిళనాడు సీట్లు 39 నుంచి 59కి, కేరళ లోక్ సభ సీట్లు 20 నుంచి 30కి పెరుగుతాయి. అన్ని నియోజకవర్గాలను కాకుండా170 నియోజకవర్గాలను విభజిస్తే సరిపోతుందని సిఫార్సు చేశారు. అందుకే 59 నియోజకవర్గాలను రెండుగా.. 111 నియోజకవర్గాలను 3గా చేయాలని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందంటున్నారు.

## జగన్ కు పాజిటివ్ గా మారుతోందా..



విజయవాడ, జూన్ 13, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీలో పటిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. అది వచ్చే ఎన్నికల్లోనూ చెక్కు చెదరదన్న నమ్మకంతో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు. దీంతో పాటు తమకు అదనంగా మరికొంత బలం తోడవుతుందని, తద్వారా తన గెలుపు ఖాయమని భావిస్తున్నారు. అందుకే అధికార పక్షంపై జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. నేరుగా చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేశ్ లపైన కూడా విమర్శలు చేస్తూ పాలనలో లోటుపాట్లను మీడియా సమావేశాల ద్వారా బయటపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో తనకు దూరమైన వర్గాలు తిరిగి తన చెంతకు చేరతాయని నమ్ముతున్నారు.గత ఎన్నికల్లో మధ్యతరగతి ప్రజలతో పాటు, రెడ్డి సామాజికవర్గంలోనూ ఓట్లు చీలిపోయాయి. ఉన్నత వర్గాల ఓట్లు ఎటూ రాలేదు. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా అడ్డం తిరిగారు. తమపై పనిభారం మోపడంతో పాటు తమకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడం, ప్రయోజనాలు కూడా ఇవ్వకపోవడంతో అసంతృప్తి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు 90 శాతం మందికిపైగా నాటి ఎన్నికల్లో కూటమి వైపునకు మొగ్గు చూపారు. అయితే ఇప్పుడు తనకు దూరమైన అన్ని వర్గాల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఉందని జగన్ భావిస్తున్నారు. ఈ అదనపు బలం దాదాపు పదిశాతం ఓట్లు తనకు యాడ్ అవుతాయని తన సన్నిహితుల వద్ద లెక్కలు చెబుతున్నారని తెలిసిందిగత ఎన్నికల్లో తన సొంత సామాజికవర్గం లో కూడా అసంతృప్తి ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. రెడ్డి సామాజికవర్గంలో జగన్ పాట్ల సానుభూతి వచ్చిందని భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా గత ప్రభుత్వమే మేలన్న అభిప్రాయంలో ఉన్నారని జగన్ భావిస్తున్నారు. అందుకే ఈ సారి ఎన్నిలకు ముందు జగన్ కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సారి జగన్ హామీలు కూడా భారీగా ఉంటాయని అంటున్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులకు సంబంధించి కీలక హామీలను ప్రకటిస్తారని, అందుకే జగన్ అన్ని లెక్కలు వేసుకునిఈసారి తనదే అధికారమన్న ధీమాలో ఉన్నారన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.

## నయా స్ట్రాటజీతో జనసేనాని

విజయవాడ, జూన్ 13, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ఆలోచన అంతా కొత్త ఓటు బ్యాంకుపైనే ఉంది. యువ ఓటర్లపైనే ఆయన ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. వచ్చే ఎన్నికల నాటికి కొత్తతరం ఓటర్లు లక్షల సంఖ్యలో వస్తారు. వారే ఎన్నికల్లో విజయానికి కీలకంగా మారనున్నారు. గెలుపులో యువత కీలక భూమిక పోషిస్తుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అందుకే తనకు కులాలు అంటగట్టవద్దని పదే పదే కోరుతున్నారు. తనను ఒక కులానికే ముద్ర వేసి చూడవద్దని, అందరూ ఓట్లు వేస్తేనే తాను గెలిచానని పవన్ కల్యాణ్ పదే పదే గుర్తు చేస్తున్నారు. దీని వెనక పవన్ ఆలోచన రాబోయే యువతరం ఓట్లను ఆకట్టుకునేందుకేనన్నది ఆయన నయా స్ట్రాటజీగా తెలుస్తుంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చంద్రబాబును పక్కన పెడితే .. టీడీపీలో లోకేశ్, వైసీపీలో జగన్, జనసేనలో పవన్ అందరూ చిన్న వయసు వాళ్లే. అందరికంటే లోకేశ్ వయసులో చిన్న అయినప్పటికీ రాజకీయాల్లోకి వచ్చేసరికి మిగిలిన ఇద్దరూ కూడా యూత్ లీడర్ల కిందే లెక్క. అయితే ఈ ముగ్గురిలో యూత్ తనకు కనెక్ట్ అవ్వాలన్నది జనసేనాని ఆలోచనగా ఉంది. పవన్ కల్యాణ్ పై అవినీతి ముద్ర లేదు. మాట మీద నిలబడి ఉండరన్న పేరు తప్ప.. పవన్ కల్యాణ్ పై రెటువంటి చెడు అభిప్రాయం లేదు. మరొకవైపు పవన్ కల్యాణ్ ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం పనిచేస్తారని, రాజకీయాల కంటే ఎక్కువగా అభివృద్ధి పనులపై ఫోకస్ పెడతారన్న పేరు తెచ్చుకోవాలన్న తాపత్రయంలో పవన్ కల్యాణ్ ఉన్నారు.ఇప్పటికే ఓటర్ల సమగ్ర సవరణ ప్రారంభం కానుంది. చాలా వరకూ ఓట్లు పోతాయి. 2029 ఎన్నికల్లో కొత్త ఓటర్లు వచ్చి చేరతారు. వారిని టార్గెట్ చేసుకుని తాను ముందుకు వెళితే గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వస్తాయని పవన్ కల్యాణ్ అంచనా వేస్తున్నారు. తమిళనాడులో విజయ్ కు యువత, మహిళలు ఎక్కువగా కనెక్ట్ కావడంతోనే పార్టీ పెట్టిన ఏడాదిన్నరకే అధికారంలోకి వచ్చారు. అలాంటిది ప్రయత్నిస్తే తాను ఎందుకు కాలేనన్న నమ్మకంతో పవన్ కల్యాణ్ ఉన్నారు. అందుకే ఆయన సొంత సామాజికవర్గాన్ని కూడా దూరం చేసుకునేందుకు సిద్ధమయ్యారన్న టాక్ జనసేన వర్గాల్లో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. మొత్తం మీద పవన్ కల్యాణ్ యువతను ఎంత మేరకు ఆకట్టుకుంటారన్నది భవిష్యత్ లో తేలనున్నప్పటికీ ఆయన ఆలోచన మాత్రం విభిన్నంగా సాగుతుందనే చెప్పాలి.

## రాయలసీమలో లిమిటేషన్ రచ్చ

తిరుపతి, జూన్ 13, మరోసారి నియోజకవర్గాల పునర్విభజన అంశం తెరపైకి వచ్చింది. మొన్నటికి మొన్న మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లు వెనక్కి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో పునర్విభజన బిల్లును వెనక్కి తీసుకుంది కేంద్రం. అయితే ఎట్టి పరిస్థితుల్లో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గ రాజకీయ పరిస్థితులు కలిసి వస్తున్నాయి. బెంగాల్ తో పాటు తమిళనాడులో లోక్సభ సభ్యుల బలం ఎన్డీఏకు అదనపు బలంగా మారనుంది. ఈ పరిస్థితుల్లో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నిన్ననే తాజా వర్కింగ్ పేపర్ నియోజకవర్గాల పునర్విభజనపై విడుదల చేసింది. దేశవ్యాప్తంగా పార్లమెంట్ స్థానాలు పెరగడంతో పాటు ఏపీలో కూడా పెరిగే ఛాన్స్ ఉంది. ఇప్పుడు ఉన్న 25 పార్లమెంట్ స్థానాలకు గాను మరో పదమూడు సీట్లు పెరుగుతాయి. అయితే సింహభాగం పెరుగుదల అనేది రాయలసీమలో కావడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.కొంతకాలంగా తీవ్ర అధ్యయనం చేసిన ఈ ఆర్థిక మండలి తన నివేదికను బయటపెట్టింది. కొత్త ప్రతిపాదనలను పెట్టింది. వీటిని చూస్తే పునర్విభజనతో ఎక్కువగా లాభపడేది రాయలసీమ. అత్యంత ప్రతిష్టాత్మకమైన లోక్ సభ స్థానాలుగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, రాజంపేట నియోజకవర్గాల పరిధి చాలా పెద్దదిగా ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానాన్ని మూడు గా విభజిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అభిప్రాయపడింది. ఈ నాలుగు సీట్ల పరిధిలో మరో 8 పెరగనున్నాయన్నమాట. ఇదే జరిగితే భవిష్యత్తులో దేశ రాజకీయాలతో పాటు రాష్ట్రంలో అధికార పీఠాన్ని శాసించడంలో రాయలసీమ విపరీతమైన ప్రభావం చూపి అవకాశం ఉంది.రాయలసీమలో పునర్విభజనతో ఎనిమిది పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉంది. అయితే ఉత్తరాంధ్రలో మాత్రం కేవలం రెండు లోక్ సభ సీట్లు పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది. విశాఖ గ్లోబల్ సిటీగా మారుతున్న తరుణంలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని ఈ మండలి ప్రతిపాదించింది. అంటే విజయనగరం, శ్రీకాకుళంలో ఉన్న పార్లమెంట్ స్థానాలను యధాతథంగా ఉంచి.. విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి ఓ రెండు స్థానాలను విభజించి పెంచుతారు అనేది ఈ ప్రతిపాదనల సారాంశం. అయితే ఆశ్చర్యకరంగా రాష్ట్రంలో అత్యధిక జనాభా, రాజకీయ ప్రాధాన్యత కలిగిన కోస్తాంధ్ర, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మాత్రం ఇప్పుడున్న సీట్లను యధాతథంగా ఉంచాలని ఈ నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. కోస్తా జిల్లాల్లో జనాభా నియంత్రణ ప్రమాణాలు స్థిరంగా ఉండటం, నియోజకవర్గాల భౌగోళిక పరిమితులు ఓటర్ల సంఖ్యకు అనుకూలంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. 2027 జనాభా లెక్కల ప్రకారం ఈ పునర్విభజన చేపడితే రాజకీయంగా రాయలసీమ మరోసారి పై చేయి సాధించే అవకాశం ఉంది. దాదాపు 13 పార్లమెంటు స్థానాలు పెరగడంతో అన్ని పార్టీల్లో ఆశావహులకు అవకాశాలు దక్కుతాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## ఫీల్ గుడ్ సరే...వీటి సంగతేంటీ...

విజయవాడ, జూన్ 13, అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీలో విపరీతమైన నిరాశ కనిపిస్తోంది. అందువల్లే ఏ మాత్రం అవకాశం దొరికినా సరే వదిలిపెట్టకుండా దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. జరిగింది ఇసుకంత అయితే.. దానిని పెద్ద బండరాయి లాగా చూపించే ప్రయత్నం చేస్తోంది. ఇది కూటమి ప్రభుత్వానికి ఇబ్బంది కరంగా మారింది. అయితే ఇటువంటి లోపాల మీద కూటమి ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోకపోతే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.అభివృద్ధి, సంక్షేమం అని చెబుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం కచ్చితంగా వీటి మీద దృష్టి పెట్టాలి. అన్ని రకాలుగా పింఛన్లను భారీగా పెంచామని ప్రభుత్వం చెబుతోంది. కానీ రెండు సంవత్సరాల కాలంలో ఇంతవరకు కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కొత్తగా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. గృహాలను కూడా నిర్మించలేదు. నాడు వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అనర్హులకు పింఛన్లు ఇచ్చారు. వారిపై ఇంతవరకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. రీసర్వే సమస్యను ఇంతవరకు పరిష్కరించలేదు. క్వాంటం వ్యాలీ.. డేటా సెంటర్లు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సామాన్యులకు ఏ విధమైన ఉపయోగం లభిస్తుందో వివరించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం మీద ఉన్నది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగుల జీతాలు ఆలస్యం అయ్యేవి. విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు కూడా సరిగా వచ్చేవి కాదు. పిఆర్సి అమల్లో జగన్ ప్రభుత్వం మొండిగా ఉండేది. చివరికి సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్ వెనుకడుగు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల విషయంలో సానుకూల ధోరణితో కనిపిస్తోంది. వేల కోట్ల బకాయిలు విడుదల చేసింది. ఉద్యోగుల సమస్యల మీద దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.అమరావతి నిర్మాణంలో ప్రభుత్వం ఇంకా వేగం పెంచాల్సి ఉంది. కొన్ని విషయాల పట్ల పాఠాలు నేర్చుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ భవనాలు.. సముదాయాల నిర్మాణం మీదనే ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే పబ్లిక్ యాక్టివిటీ లో వేగం పెరగాలంటే కచ్చితంగా లే అవుట్లు డెవలప్ కావాలి. అవి లేకుండా అమరావతిలో ఎవరు కూడా ఇల్లు కట్టుకునే సాహసం చేయరు. వ్యాపారాలు ప్రారంభించలేరు.వైసీపీ పరిపాలనలో ఏపీ రాష్ట్రంలో ఆర్థిక లోటు పెరిగిపోయింది. సంక్షేమ పథకాలకు మాత్రమే నిధుల సర్దుబాటు జరుగుతోంది. అభివృద్ధి పనుల విషయంలో కాస్త ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. అప్పుల మీదనే ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందువల్ల అప్పుల భారం పెరిగిపోతు ంది. వీటివల్ల కీలకమైన పథకాల అమలు సాధ్యం కావడం లేదు. ఉదాహరణకు ఎన్టీఆర్ వైద్య సేవ బకాయిలు భారీగా పెరిగిపోయాయి. ఈ పథకానికి నిధుల సర్దుబాటు చేయడం ప్రభుత్వానికి ఇబ్బంది కరంగా మారింది.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా అధికారులు వ్యవహరించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అలానే కొనసాగుతోంది. పొలిటికల్ గవర్నెన్స్ ను అమలు చేయాలని చంద్రబాబు చెబుతున్నప్పటికీ అధికారులు వినిపించుకోవడం లేదు. కన్సల్టెంట్లు ప్రభుత్వంలో హవా కొనసాగిస్తున్నారు. కన్సల్టెంట్లు చెప్పిన మాటనే ప్రభుత్వం పాటిస్తోంది.. కొన్ని సందర్భాలలో కన్సల్టెంట్లు చెప్పినట్టుగానే చంద్రబాబు చేయాల్సి వస్తుంది. దీనివల్ల సోషల్ మీడియాలో విష ప్రచారం జరుగుతోంది.సూపర్ సిక్స్ పథకాలలో ఇంకా రెండు అమలు కావడం లేదు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు.. ఇది సాధికాకపోతే నెలకు 3000 నిరుద్యోగ భృతి.. ప్రతినెల మహిళకు 1500 రూపాయల చొప్పున ఆడబిడ్డ నిధి ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. ఇక మిగతా పథకాలు తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ.. దీపం 2.. స్త్రీ శక్తి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి.కొంతమంది నేతలు ఇష్టానుసా రంగా ప్రవర్తిస్తున్నారు. దారుణంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అవినీతి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. పోలీస్ విధుల్లో కూడా జోక్యం చేసుకుంటున్నారు.వారివల్లకూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది.. ఎమ్మెల్యేలు వ్యవహార శైలి మార్చుకోవాల్సిన అవసరం ఉంది. స్వయంగా చంద్రబాబు రంగంలోకి దిగి హెచ్చరికలు జారీ చేస్తున్నారంటే.. ప్రజాప్రతినిధులు ఎలా వ్యవహరి స్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఇలా చేసి వైసిపి ప్రజల నుంచి ఎలాంటి ఫలితాన్ని ఎదుర్కొన్నదో అందరూ చూశారు.

## అగ్రికల్చర్ లోహాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానం..

అనంతపురం, జూన్ 13, ఉమ్మడి అనంతపురం జిల్లా.. కరవుకు కేరాఫ్ అడ్రస్.. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం. ఏళ్ల తరబడి కరువు కాటకాలు వేధిస్తున్నా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, భూమాతపై నమ్మకంతో వ్యవసాయాన్నే నమ్ముకుని ధైర్యంగా ముందడుగు వేసే రైతన్నలు ఎందరో. కానీ కాలం మారుతోంది. అనంత రైతులు టెక్నాలజీ బాట పడుతున్నారు. మూస ధోరణి వీడి.. సరికొత్త సాంకేతిక పద్ధతులతో సాగులో అద్భుతాలు చేస్తున్నారు. సంప్రదాయ విధానాలను పక్కనబెట్టి హార్టీకల్చర్, పండ్ల తోటల సాగులో రాణిస్తున్నారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానాన్ని ఎక్కువగా ఆఫ్రికా దేశాలలో ఉపయోగిస్తుంటారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాలలో ఈ విధానం ద్వారా వ్యవసాయం చేపడుతుంటారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ అంటే.. కొండకు వాలుగా ఉన్న పొలాలలో అర్ధ చంద్రాకారపు ఆకారంలో గుంతలు తవ్వడం. సాధారణంగా ఈ గుంతలు ఒకటి నుంచి రెండు మీటర్ల వ్యాసం కలిగి ఉంటాయి. ఈ విధంగా చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చు. అలాగే నేల సారవంతాన్ని పునరుద్ధరించవచ్చు. ఈ విధానం ద్వారా రైతులు భారీగా పెట్టుబడులు లేకుండానే బీడు భూములను పునరుద్ధరించుకోవచ్చు. ఇలా కొండకు వాలుగా గుంతలు తవ్వటం ద్వారా వర్షం కురిసినప్పుడు ఆ వర్షపు నీరు వీటిలో చేరి అక్కడే ఇంకిపోతుంది. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ విధానం అనుసరిస్తుంటారు.అలాంటి ఓ రైతే ప్రమీలమ్మ. ఆఫ్రికా దేశంలో అనుసరించే హాఫ్‌మూన్ విధానంతో గత ఎనిమిది సంవత్సరాలుగా పంటలు సాగు చేస్తూ రోజువారీ ఆదాయం పొందుతున్నారామె. తన సక్సెస్ స్టోరీతో ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి కూడా అభినందనలు అందుకున్నారు ప్రమీలమ్మ.కళ్యాణదుర్గం మండలంలోని భట్టువానిపల్లికి చెందిన ప్రమీలమ్మకు మూడు ఎకరాల పొలం ఉంది. అర ఎకరంలో ఏ – గ్రేడ్ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు ప్రమీలమ్మ. మిగతా రెండున్నర ఎకరాలలో వేరుసెనగ పంట పండిస్తున్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తూ రసాయనాలకు దూరంగా సొంతంగా తయారుచేసుకున్న జీవామృతాన్ని పిచికారీ చేస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఏ గ్రేడ్ విధానంలో సాగుచేసే ఆకుకూరలు, కూరగాయలతో రోజూ ఆదాయం పొందుతున్నారు. ఎలాంటి రసాయనాలు లేకుండా పూర్తిగా సేంద్రీయ విధానంలో పంటలు పండిస్తూ ఉండటంతో ప్రమీలమ్మ ఇంటివద్దకే వచ్చి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నారు. ఇక ప్రమీలమ్మ గురించి తెలిసిన సీఎం చంద్రబాబు జలహారతి కార్యక్రమంలో ఆమెను అభినందించారు.ఏ గ్రేడ్ సాగు అనేది ప్రకృతి వ్యవసాయంలో ఒక పద్ధతి. ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడితో, ఒకే సమయంలో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. ఒకే పొలంలో, ఒకే సమయంలో ప్రధాన పంటతో పాటుగా అనుబంధంగా మరో మూడు లేదా నాలుగు పంటలు సాగు చేయడాన్ని ఏ గ్రేడ్ మోడల్ అని పిలుస్తుంటారు. ఈ రకంగా వివిధ రకాల పంటలను పండించటం ద్వారా నేల సారం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. అలాగే అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే రోజూవారీ ఆదాయం కూడా పొందవచ్చని చెప్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఈ మధ్యకాలంలో ఈ విధానం పెరుగుతోంది.

## డేటా సెంటర్లు...

### 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ కు ప్లానింగ్

విశాఖపట్టణం, జూన్ 13, ఏపీలోని విశాఖపట్టణం డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతోంది. ఆ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే, డేటా సెంటర్లకు లోటులేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డేటా సెంటర్ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీర్ఘకాలిక పవర్ ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. రాబోయే పదేళ్లలో డేటా సెంటర్ల విద్యుత్ అవసరం దాదాపు 15 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం.. అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది.విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో డేటా సెంటర్లకు లోటు లేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రణాళికలపై చర్చించారు. విశాఖపట్టణం ప్రాంతంలో ప్రస్తుతం 16భారీ డేటా సెంటర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని ఏపీ ట్రాన్స్‌కో అంచనా వేసింది. వీటి ద్వారా సుమారు 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ ఏర్పడనుండగా.. అనుబంధ మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల అవసరాలను కలుపుకుని మొత్తం విద్యుత్ డిమాండ్ 2036–37 నాటికి 15 గిగా వాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ అవసరాలను తీర్చేందుకు 765 కేవీ, 400 కేవీ, 220 కేవీ స్థాయిల్లో ట్రాన్స్ మిషన్ నెట్ వర్క్ ను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు.ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ అభివృద్ధి కోసం పెందుర్తి, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవారి పాలెం వంటి కీలక సబ్ స్టేషన్లను అనుసంధానించేలా ఈ వ్యవస్థను నిర్మించనున్నారు. ఈ నెట్‌వర్క్ 2034 నాటికి 15 గిగావాట్లకుపైగా డేటా సెంటర్ లోడ్‌ను మోయగల సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. ఈ ప్రణాళికలో భాగంగా రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపైనా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ ప్రాంతంలో భారీ పెట్టుబడుల కోసం కొత్త 400 కేవీ, 200 కేవీ సబ్ స్టేషన్లతో పాటు అధిక సామర్థ్యం కలిగిన ప్రత్యేక విద్యుత్ ప్రసార మౌలిక వసతులు, ట్రాన్స్ మిషన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా తార్లువాడ, ముడసర్లోవ, పోలేపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ హబ్‌ల కోసం అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.గూగుల్, రిలయన్స్, టీసీఎస్ హైపర్‌వాల్ట్, సీటీఆర్ఎల్ఎస్ , జీఎంఆర్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖలో డేటాసెంటర్లు ఏర్పాటుచేయడంపైఆసక్తి చూపుతు న్నాయని అధికారులు వెల్లడించారు.పెట్టుబడులు రాష్ట్రంలో ఉపాధి అవకా శాలను పెంచడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని ప్రధాన డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా నిలబెడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.



# ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లలో నీళ్లు తాగుతున్నారా..!?



వాటర్ బాటిల్. ఎక్కడకు వెళ్లినా.. ఎక్కడ చూసినా నీళ్లు తాగాలంటే బాటిల్ ఉండాల్సిందే. బాటిల్ నీళ్లు తాగటం ఈ మధ్య కాలంగా బాగా అలవాటుగా మారిపోయింది. ఏ షాపులో చూసినా ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్స్ అందుబాటులో ఉంటున్నాయి. వాటి అమ్మకాలు కోట్లలో సాగుతున్నాయి. కాగా, అసలు ఈ ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్స్ లో నీరు తాగితే ఏం జరుగుతుందనే సందేహాలు ఉన్నాయి. వీటితో వచ్చే అనర్థాలు ఎక్కువే అని నిపుణులు చెబుతున్నారు.

ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్స్ లో నీరు తాగటం పై కొద్ది రోజుల క్రితం కొలంబియా యూనివర్శిటీ, రట్‌గర్స్ యూనివర్శిటీలు సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనలో నివ్వెర పోయే వాస్తవాలు బయటపడ్డాయి. ఈ నీళ్లు తాగటం ద్వారా డబ్బిచ్చి రోగాలు కొని తెచ్చుకోవడమేనని తేల్చారు. వీటిల్లో నానో ప్లాస్టిక్స్ అంటే అత్యంత సూక్ష్మమైన ప్లాస్టిక్ రేణువులు. కంటికి ఏ మాత్రం కనిపించకుండా నీటిలో కరిగిపోయే ఈ నానో ప్లాస్టిక్ రేణువుల వల్ల తీవ్ర మైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. రక్తంలో సులువుగా కలిసిపోతాయి. మన అవయవాలను, రోగనిరోధక శక్తిని, సంతానోత్పత్తి సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నానోప్లాస్టిక్ కణాలు మన పేగులు, ఊపిరి తిత్తుల ద్వారా నేరుగా రక్తంలో కలిసి పోతాయి. రక్తం ద్వారా గుండె, మెదడు తదితర అవయవాలకు చేరుకుంటాయి. కణాల్లోకి నేరుగా కూడా చొచ్చుకుపోతాయి.

**నిపుణుల సూచనలు**

ప్లాస్టిక్ బాటిళ్ల నుండి నీరు త్రాగినప్పుడు, అనుకోకుండా ఈ చిన్న కణాలను మనం మింగేస్తాము. అనేక అంతర్జాతీయ అధ్యయనాలు బాటిల్ వాటర్‌లో మైక్రోప్లాస్టిక్‌లను కనుగొన్నాయి. వాటి ఆరోగ్య ప్రభావాల గురించి తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్లాస్టిక్‌లలోని కొన్ని రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి హార్మోన్ల అసమతుల్యత, ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకత, సంతానో త్పత్తి ప్రభావాలు, కొన్ని సందర్భాల్లో క్యాన్సర్ వంటి హానిని కలిగిస్తాయి. దీంతో, సాధ్యమైనం త వరకు వీటికి దూరంగా ఉండాలి. ఇప్పుడు చాలా ప్రాంతాల్లో గాజు సీసాల్లోనూ నీరు అంద ుబాటులో ఉంచుతున్నారు. ప్లాస్టిక్ ను దూరం చేయటానికి వీటిని వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లల్లో నీర తాగటం ఆరోగ్య పరంగా ఏ మాత్రం మంచిది కాదని నిపుణులు హెచ్చరి స్తున్నారు.

# సూపర్ టేస్టీ 'మామిడికాయ పులిహోర'.. ఇదొక్కటి యాడ్ చేస్తే టేస్ట్ అదుర్స్..!

ప్రస్తుతం వేసవి సీజన్ లో మామిడిపండ్లు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తుంటాయి. అటు మామిడి పండ్లతో పాటు పచ్చి మామిడి కాయలు కూడా అధికంగా కొనుగోలు చేస్తుంటారు. పచ్చి మామిడికాయతో పప్పు, పచ్చడి చేసుకోవడం చాలామందికి అలవాటే.. కానీ మామిడికాయతో పులిహోర కూడా చాలా టేస్టీగా ఉంటుంది. అయితే మామిడికాయ పులిహోర అందరికీ సరిగ్గా రాదు. చాలామందికి పులుపుగానో లేక చప్పగానో వస్తుంది. అయితే ఫర్ ఫెక్ట్ కొలతలతో మామిడికాయ పులిహోర చేస్తే ఆ టేస్ట్ చాలా అద్భుతంగా ఉంటుంది. మరి సూపర్ టేస్టీ మామిడికాయ పులిహోరను ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? తక్కువ పదార్థాలతో ఈ వంటకాన్ని ఎలా తయారు చేసుకోవాలి..? తదితర పూర్తి వివరాలు ఇక్కడ చూద్దాం.. మామిడికాయ పులిహోర తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. బియ్యం రెండు కప్పులు, మామిడికాయ తురుము ఒక కప్పు, పల్లీలు పావు కప్పు, మినపప్పు ఒక టేబుల్ స్పూన్, శనగపప్పు ఒక టేబుల్



స్పూన్, ఆవాలు ఒక టీ స్పూన్, జీలకర్ర ఒక టీ స్పూన్, పసుపు పావు టీ స్పూన్, ఎండు మిర్చి ఆరు నుంచి ఎనిమిది, కరివేపాకు ఒక రెప్ప, కరివేపాకు ఒక రెబ్బ, ఇంగువ పావు టీ స్పూన్, నూనె నాలుగు టేబుల్ స్పూన్ లు, ఉప్పు తగినంత తీసుకోవాలి. మామిడికాయ పులిహోర తయారీ విధానం చూస్తే ముందుగా బియ్యం ఉడికించుకోవాలి. బియ్యాన్ని శుభ్రంగా కడిగి మొత్తగా కాకుండా ఉడికించుకోవాలి. ఆ తర్వాత చల్లారనివ్వాలి. కడాయిలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, మినప్పప్పు, శనగపప్పు, పల్లీలు వేసి బంగారు రంగు వచ్చేంత వరకూ వేయించుకోవాలి. ఇప్పుడు ఎండుమిరపకాయలు, కరివేపాకు, ఇంగువ వేసి కొద్దిగా వేయించుకోవాలి. ఆ తర్వాత తరిగిన మామిడికాయ, పసుపు, ఉప్పు వేసి మూతపెట్టి రెండు నుంచి మూడు నిమిషాలు మరిగించుకోవాలి. మరిన్ని కనుగొనండి జ్యోతిష్య సేవలు ఆర్థిక సలహాలు అంతర్జాతీయ వార్తలు తెలుగు వార్తల యాప్ బ్రేకింగ్ న్యూస్ సేవ ఇప్పుడు చల్లారిన బియ్యాన్ని అందులో వేసి బాగా కలపాలి. అలా తక్కువ మంటపై మూడు నుంచి నాలుగు నిమిషాలు ఉంచాలి. ఇప్పుడు అన్నీ బాగా కలిసిన తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి. అంతే ఘుమఘుమలాడే మామిడికాయ పులిహోర రెడీ అయినట్టే..

# తిరుమల స్పెషల్ కొబ్బరి పచ్చడి.. ఇలా చేస్తే అస్సలు వదిలిపెట్టరు!



తిరుమల తిరుపతి దేవస్థానం అన్నప్రసాద భవనంలో వడ్డించే స్పెషల్ కొబ్బరి పచ్చడి రుచి చాలా అద్భుతంగా ఉంటుంది. సాధారణంగా మనం ఇంట్లో చేసుకునే కొబ్బరి చట్నీ కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులో కొబ్బరి ముక్కలను నూనెలో ప్రత్యేకంగా వేయిస్తారు. వేడివేడి అన్నంలోకి కొద్దిగా నెయ్యి, ఈ పచ్చడి వేసుకుని తింటే అమృతంలా ఉంటుంది. ఆ అసలైన తిరుమల స్టైల్ కొబ్బరి పచ్చడిని ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం. కావాల్సిన పదార్థాలు పచ్చి కొబ్బరి ముక్కలు: 1 కప్పు (చిన్న ముక్కలుగా కట్ చేసినవి) పచ్చి శనగపప్పు: 2 టేబుల్ స్పూన్లు ఎండుమిర్చి: 15 నుండి 20 (మీ కారానికి తగినట్లు) చింతపండు: నిమ్మకాయ సైజంత (ముందుగా నానబెట్టుకోవాలి) పసుపు: పావు టీస్పూన్ ఉప్పు: రుచికి సరిపడా ఆయిల్: డీప్ ఫ్రైకి మరియు తాలింపుకు సరిపడా తాలింపు గింజలు: ఒక స్పూన్ ఇంగువ: చిటికెడు కరివేపాకు: రెండు రెబ్బలు మరిన్ని కనుగొనండి ఎడ్యుకేషన్ జాబ్స్ వ్యాపార వార్తలు వీడియో కంటెంట్ ఆటోమొబైల్స్ రివ్యూలు సినిమా వార్తలు తయారీ విధానం: స్టవ్ ఆన్ చేసి కడాయిలో డీప్ ఫ్రైకి సరిపడా ఆయిల్ పోసి వేడి చేయాలి. నూనె వేడెక్కిన తర్వాత కట్ చేసి పెట్టుకున్న పచ్చి కొబ్బరి ముక్కలను వేసి, మంటను మీడియం ఫ్లేమ్‌లో ఉంచి లేత బంగారు రంగు వచ్చే వరకు వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. అదే నూనెలో 2 టేబుల్ స్పూన్ల పచ్చి శనగపప్పు వేసి దోరగా వేయించి పక్కకు తీయాలి. కొబ్బరి పచ్చడి ఇలా చేస్తేనే రుచి ఆ తర్వాత అదే వేడి నూనెలో ఎండుమిర్చిని కూడా వేసి వేయించి ప్లేట్‌లోకి తీసుకోవాలి. వీటన్నింటినీ పూర్తిగా చల్లారనివ్వాలి. ఇప్పుడు ఒక మిక్సీ జార్ తీసుకుని అందులో ముందుగా వేయించిన ఎండుమిర్చి, పచ్చి శనగపప్పు, తగినంత ఉప్పు వేసి కొద్దిగా బరకగా పట్టుకోవాలి. ఆ తర్వాత వేయించిన కొబ్బరి ముక్కలు, నానబెట్టిన చింతపండు (నీటితో సహా) మరియు పసుపు వేసి, అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసుకుంటూ పచ్చడిని బరకగా గ్రైండ్ చేసుకోవాలి. పచ్చడిలో తాలింపు తో సూపర్ రుచి కొబ్బరి పచ్చడి మరీ మెత్తగా పేస్ట్‌లా చేయకూడదు. మరో చిన్న పాన్‌లో రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. నూనె కాగాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకు మరియు ముఖ్యంగా చిటికెడు ఇంగువ వేసి వేయించాలి. తాలింపు వేగిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి, గ్రైండ్ చేసి పెట్టుకున్న కొబ్బరి పచ్చడిని ఇందులో వేసి బాగా కలుపుకోవాలి. తిరుమల కొబ్బరి పచ్చడి రుచి రావాలంటే ఈ చిట్కాలు పాటించాలి తిరుమల కొబ్బరి పచ్చడి అసలైన రుచి రావాలంటే కొబ్బరి ముక్కలను నూనెలో వేయించడం మరియు పచ్చడిని రోటి పచ్చడిలా బరకగా గ్రైండ్ చేసుకోవడం చాలా ముఖ్యం. అలాగే తాలింపులో ఇంగువను అస్సలు స్కిప్ చేయద్దు, అదే దీనికి గుడి ప్రసాదం లాంటి కమ్మని వాసనను ఇస్తుంది.

# మధుమేహ బాధితులకు ఈ నీరు వరం..!!





మధుమేహ బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా వయసుతో సంబంధం లేకుండా షుగరు బాధితులు పెరుగుతున్నారు. చాలా మంది రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచేందుకు వివిధ ఇంటి చిట్కాలను పాటిస్తారు. జీలకర్ర, మెంతులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని నీటిలో నానబెట్టి తాగడం వల్ల ఇన్సులిన్ ఉత్పత్తి మెరుగవడంతో పాటు జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. అయితే, రక్తంలో చక్కెరను త్వరగా తగ్గించడానికి మెంతుల నీరు మంచిదా లేదా జీలకర్ర నీరు మంచిదా అనే సందేహం చాలామందిలో ఉంది. దీని పైన నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. మధుమేహ బాధితుల కు జీరా వాటర్ మేలు చేస్తుంది. ఇది రక్తంలో చక్కెర నియంత్రణలో పలు ప్రయోజనాలు అందిస్తుంది. జీలకర్ర నీరు జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది. జీలకర్రలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వాపును తగ్గించి కణాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇది బరువు తగ్గడంలో, అలాగే చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. బరువు తగ్గడం వల్ల ఇన్సులిన్ పనితీరు మెరుగవుతుంది, తద్వారా పరోక్షంగా చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. ఉదయం గోరువెచ్చని జీలకర్ర నీటిని తాగడం వల్ల రోజంతా శక్తివంతంగా ఉండవచ్చు. జీలకర్రలో ఉన్న యాంటీ డయాబెటిక్ లక్షణాలు టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, ఊఎం1ఇ స్థాయిలను గణనీయంగా తగ్గించాయి. దీని వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడి శరీరం గ్లూకోజ్‌ను సమర్థవంతంగా వినియోగించగలుగుతుంది. అదేవిధంగా జీరా వాటర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మరిన్ని కనుగొనండి టెక్నాలజీ గాడ్జెట్లు క్రికెట్ స్కోర్లు ఎడ్యుకేషన్ జాబ్స్ వీడియో కంటెంట్ ట్రావెల్ గైడ్స్ మధుమేహ బాధితులకు ప్రయోజనకరం ఆరోగ్య నిపుణుల ప్రకారం, మధుమేహ బాధితులకు మెంతులు నిజంగా ఒక వరం, ఎందుకంటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో సహాయపడతాయి. ఒక చెంచా మెంతులను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం ఆ నీటిని తాగడం, మెంతులను నమలడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. ఇది ముఖ్యంగా టైప్-2 మధుమేహం ఉన్నవారికి చాలా ఉపయోగకరం. ఇది గట్ (జీర్ణవ్యవస్థ)లో జెల్ లాంటి పదార్థంగా మారి గ్లూకోజ్ శోషణను నెమ్మదిగా చేస్తుంది. ట్రైగ్లిసరైడ్స్, ఒఆఒ, టోటల్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో తీసుకుంటే ఫాస్టింగ్ బ్లడ్ షుగర్‌ను మెరుగుపరచడంలో ఇది మరింత ఉపయోగకరంగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను త్వరగా తగ్గించుకోవాలనుకునే వారికి మెంతుల నీరు ఉత్తమం. జీర్ణ సమస్యలు ఉన్నవారు లేదా బరువు తగ్గాలనుకునేవారు జీలకర్ర నీటిని ఎంచుకోవచ్చు. మీ శరీర స్వభావాన్ని బట్టి, వైద్యుడి సలహాతో ఈ రెండింటినీ తీసుకోవచ్చు. జీవనశైలిలో మార్పులు.. ఆరోగ్య కరమైన ఆహారంతో వైద్యుడి సూచనల మేరకు నడుచుకోవటం ద్వారా షుగరును నియంత్రణలో ఉంచుకోవచ్చని సూచిస్తున్నారు.

# రాత్రి భోజనం చేశాక కాసేపు నడిస్తే..ఈ సమస్యలున్న వారికి బిగ్ రిలీఫ్..!!



వాకింగ్. ఎవరికైనా ఆరోగ్యాన్ని అందించే వ్యాయామం. ఏ వయసు వారైనా వాకింగ్ చేయటం ద్వారా ఆరోగ్య పరంగా ప్రయోజనాలు అందుకోవచ్చు. ఉదయం సమయంలో ఎక్కువ మంది వాకింగ్ కు వెళ్తారు, అయితే, రాత్రి భోజనం తర్వాత స్వల్పంగా నడవడం జీర్ణక్రియకు చాలా కాలంగా సూచిస్తున్న సరళమైన అలవాట్లలో ఒకటిగా నిపుణులు చెబుతున్నారు. ఈ నడక మధుమేహ బాధితులకు ఎంతో మేలు చేస్తుంది. పలు రకాల సమస్యలకు ఈ తరహా నడక ప్రయోజనకరమని వైద్యులు పేర్కొంటున్నారు. రాత్రి పూట భోజనం తరువాత కాసేపు నడక ద్వారా ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. నడక కేవలం ఆహారం జీర్ణం కావడానికే కాదు, కడుపులో గ్యాస్, ఉబ్బరం తగ్గించడంలో, మలబద్ధకం తగ్గించడంలో, అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జీర్ణాశయ ఆరోగ్య నిపుణుల ప్రకారం భోజనం చేసిన తర్వాత 5 నుంచి 15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. ఇంటి చుట్టూ, ఆఫీస్‌లో, ట్రెడ్‌మిల్‌పై లేదా బయట వీధిలో నెమ్మదిగా నడిచినా సరిపోతుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సమయంలో కఠినమైన వ్యాయామం చేయకుండా సాదాసీదా నడక మాత్రమే చేయాలని సూచన చేస్తున్నారు. భోజనం తర్వాత నడక వల్ల ఆహారం పేగుల్లో సులభంగా కదలడంలో సహాయం జరుగుతుంది. ఆరోగ్య పరమైన ప్రయోజనాలు ఇలా నడవటం వలన కడుపులోని గ్యాస్ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండి ఉబ్బరం తగ్గుతుంది. అలాగే పేగుల కదలికలు మెరుగుపడి మల విసర్జన సులభమవుతుంది. యాసిడ్ రిఫ్లక్స్ సమస్యతో బాధపడేవారికి కూడా ఈ అలవాటు కొంత ఉపశమనం ఇస్తుంది. భోజనం చేసిన వెంటనే పడుకోవడం లేదా కూర్చోవడం కంటే కొద్దిసేపు నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి అసౌకర్యం తగ్గుతుంది. ముఖ్యంగా ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారికి భోజనం తర్వాత చిన్న నడక శరీరానికి చలనం కలిగించి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఫార్ట్ వాక్స్ చేయాలంటే ముందుగా భోజనం పూర్తి చేసిన తర్వాత కొద్దిసేపు ఆగాలి. ఆ తర్వాత నెమ్మదిగా, ఒత్తిడి లేకుండా నడవాలి. వేగంగా పరుగులు తీయడం లేదా గట్టిగా వ్యాయామం చేయడం మంచిది కాదు. రోజూ రాత్రి భోజనం తర్వాత ఇలా కొద్దిసేపు నడిస్తే జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. సాధారణంగా కనిపించే ఈ అలవాటు దీర్ఘకాలంలో మంచి ఆరోగ్యానికి దోహదపడుతుంది. ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలు, గ్యాస్, మలబద్ధకం వంటి ఇబ్బందులు తరచూ ఎదురయ్యే వారు ఈ వాకింగ్ అలవాటు చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

# స్పోర్ట్స్ న్యూస్

## ఎవరిపై ఓడినా పర్వాలేదు.. పాక్‌పై మాత్రం గెలవాలి: జెమీమాతో వాచ్‌మెన్




మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 ఇప్పటికే మొదలైంది. ఆదివారం టీమిండియా తన తొలి మ్యాచ్‌ను బర్మింగ్‌హామ్ వేదికగా పాకిస్థాన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు భారత స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. భారత్-పాక్ మ్యాచ్ అంటే అభిమానుల అంచనాలు ఎక్కువగా ఉంటాయని వెల్లడించింది. ఈ క్రమంలో తన అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌తో జరిగిన ఓ సంభాషణను గుర్తు చేసుకుంది.'నేను మొదటిసారి పాక్‌తో మ్యాచ్ ఆడినప్పుడు డ్రెస్సింగ్ రూమ్‌లో మా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాతో మాట్లాడింది. భారత్-పాక్ మ్యాచ్ అంటే బయట నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, అభిమానుల అంచనాలు చాలా ఎక్కువగా ఉంటాయని చెప్పింది. అంతేకాకుండా మా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కూడా.. 'ఎవరిపైన ఓడినా పర్వాలేదు.. కానీ పాకిస్థాన్‌పై మాత్రం ఓడొద్దు. ఆ మ్యాచ్‌లో మనం తప్పకుండా గెలిచి తీరాలి' అని చెబుతుంటాడు. ఈ మ్యాచ్‌పై ప్రజలకు ఎంత ఆసక్తి ఉంటుందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు' అని జెమీమా వెల్లడించింది.

**అదే మా లక్ష్యం..**

'ప్రపంచ కప్ ట్రోఫీని గెలిచిన దృశ్యాన్ని మేమంతా ప్రతిరోజూ ఊహించుకుంటాం. జట్టుగా కూర్చొని ఆ విజన్‌ను మనసులో పెట్టుకుంటాం. ఒక లక్ష్యాన్ని నిరంతరం ఊహిస్తే దానివైపు ప్రయాణం మొదలవుతుందని మేము నమ్ముతాం. వన్డే ప్రపంచ కప్ సమయంలో కూడా ఇదే విధానాన్ని అనుసరించాం. అందుకే కప్ నెగ్గాం. ప్రతి మ్యాచ్‌కు వేర్వేరు ప్రణాళికలతో సిద్ధమవుతాం. ప్రాక్టీస్‌లోనే ఒత్తిడితో కూడిన పరిస్థితులను సృష్టించుకుని వాటిని ఎదుర్కొనే ప్రయత్నం చేస్తాం. మ్యాచ్‌లో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను ముందుగానే అనుభవిస్తే అసలు పోటీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో ఆశించిన ఫలితాలు రాకపోయినా, ఆ ఓటముల నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకున్నాం' అని జెమీమా వివరించింది.

## పోలీసులు నన్ను తీవ్రంగా కొట్టారు.. బంగ్లా క్రికెటర్ ఆరోపణలు




బంగ్లాదేశ్ క్రికెటర్ నయీం హసన్ చిట్టోగ్రామ్ పోలీసులపై సంచలన ఆరోపణలు చేశాడు. పోలీసులు వేధించడమే కాకుండా తనపై దాడి చేశారని హసన్ ఆరోపించాడు. ఈ ఘటన ప్రస్తుతం బంగ్లా క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై బంగ్లా క్రికెట్ బోర్డు కూడా స్పందించింది. జాతీయ క్రికెటర్ పట్ల జరిగిన ఈ వ్యవహారం అత్యంత విచారకరమని పేర్కొంది.ఢాకా ప్రీమియర్ లీగ్‌లో ప్రైమ్ బ్యాంక్ క్రికెట్ క్లబ్ తరఫున నయీం హసన్ ప్రాతినిధ్యం వహించాడు. శుక్రవారం ఫైనల్ మ్యాచ్ అనంతరం నయీం స్వగ్రామం చిట్టోగ్రామ్‌కి బయలుదేరాడు. ఈ క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. 'మ్యాచ్ అనంతరం ఇంటికి వెళ్లాలనుకున్నా. విమానం ఆలస్యం కావడంతో ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునే వరకు రాత్రి అయింది. 11.25 గంటల సమయంలో ఎయిర్‌పోర్ట్ నుంచి మా స్వగ్రామానికి ఆటోలో బయలుదేరాను. లాల్‌ఖాన్ బజార్ ఫ్లైఓవర్ వద్ద పోలీసులు నేను ప్రయాణిస్తున్న ఆటోను ఆపి తనిఖీలు చేశారు. నా బ్యాగ్‌లు కూడా చెక్ చేశారు. ఇంతలోనే ఏం జరిగిందో తెలియదు.. నాపై దాడి చేయడం మొదలు పెట్టారు. నా గొంతు పట్టుకుని పోలీసు వాహనంలోకి ఎక్కించారు. నన్ను తీవ్రంగా కొట్టారు. బంగ్లాదేశ్ జాతీయ జట్టు క్రికెటర్‌నని చెప్పినా పట్టించుకోలేదు' అని నయీం ఆరోపించాడు.

**బీసీబీ ఆగ్రహం**

ఈ ఘటనపై బంగ్లా క్రికెట్ బోర్డు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జాతీయ క్రికెటర్ పట్ల జరిగిన ఈ వ్యవహారం అత్యంత విచారకరమని పేర్కొంది. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. కాగా, జింబాబ్వేతో జరగనున్న టెస్టు సిరీస్‌కు ఎంపికైన నయీం హసన్‌కు ఈ ఘటన ఎదురుకావడం బంగ్లాదేశ్ క్రికెట్‌లో సంచలనంగా మారింది.

## ఇంగ్లండ్ ప్లేయర్లకు ఊహించని షాక్.. శిక్షణా పరికరాలు చోరీ





స్పోర్ట్స్ డెస్క్: ఫిఫా ప్రపంచకప్ 2026లో పాల్గొనేందుకు ఇంగ్లండ్ జట్టు అమెరికాకు వెళ్లింది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాలనే పట్టుదలతో ఇంగ్లీష్ జట్టు ఉంది. ఈ క్రమంలో ఇంగ్లండ్ ప్లేయర్లకు చేదు అనుభవం ఎదురైంది. వారికి సంబంధించిన పలు జతల బూట్లు, ఫుట్‌బాల్ శిక్షణకు సంబంధించిన పలు పరికరాలు, మ్యాచ్ బాల్స్ చోరీకి గురయ్యాయి. దీంతో వారి ప్రాక్టీస్ సెషన్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..ఇంగ్లండ్ జట్టుకు సంబంధించిన సామగ్రిని ఫ్లోరిడాలోని వారి శిక్షణ కేంద్రం నుంచి మిస్సోరిలోని స్పోర్ట్ సాకర్ విలేజ్‌కు తరలించాల్సి ఉంది. వాటిని ఓ వాహనంలో మిస్సోరికి తరలిస్తుండగా దొంగతనం చోటుచేసుకుంది. పరికరాలను తరలిస్తున్న వాహనం తాళాలను పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఈ దొంగతానికి పాల్పడ్డారు. ఆ వ్యాన్‌లో ఉన్న అన్ని వస్తువులను చోరీ చేసి.. ఒక్క ఫుట్‌బాల్‌ను మాత్రమే విడిచిపెట్టారు. చోరీకి గురైన వస్తువుల్లో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్, స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ వ్యక్తిగత బూట్లు కూడా ఉన్నట్లు సమాచారం.కాగా ఈ మెగా టోర్నీలో భాగంగా ఇంగ్లండ్ తమ తొలి మ్యాచ్‌లో జూన్ 18న క్రొయేషియాతో తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం ఇంగ్లండ్ జట్టు ఇవాళ(శనివారం) కాన్సాస్ సిటీలో ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనాల్సి ఉంది. అంతలోనే ఈ ఊహించని సంఘటనతో ఇంగ్లండ్ ఆటగాళ్లు షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనపై స్పందించిన కాన్సాస్ పోలీసులు.. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## ఆస్ట్రేలియా ఓపెన్: సెమీస్‌లో సింధు ఓటమి




ఆస్ట్రేలియా ఓపెన్ 2026 టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సెమీ ఫైనల్‌లోనే నిష్క్రమించింది. శనివారం జరిగిన సెమీస్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్, జపాన్ స్టార్ అకానె యమగుచి చేతిలో సింధు వరుస మ్యాచ్‌ల్లో పరాజయం పాలైంది. 22-20, 21-12 తేడాతో సునాయస విజయం సాధించిన యమగుచి ఫైనల్‌కు దూసుకెళ్లింది.మ్యాచ్ ఆరంభంలో సింధు అద్భుత ఆటతో ఆకట్టుకుంది. దూకుడైన షాట్లతో ఆధిక్యంలో నిలిచిన ఆమె తొలి గేమ్‌లో యమగుచికి గట్టి పోటీ ఇచ్చింది. బ్రేక్ సమయం వరకు మ్యాచ్‌పై పట్టు సాధించినట్లు కనిపించినా.. ఆ తర్వాత క్రమంగా పట్టు కోల్పోయింది. తొలి గేమ్ చివరి దశలో సింధు 20-20తో సమం చేసి ఆశలు రేకెత్తించింది. కానీ ఆ తర్వాతి గేమ్‌లో యమగుచి రెండు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. రెండో గేమ్‌లో సింధు వేగం పెంచే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వరుస పాయింట్లతో యమగుచి భారీ ఆధిక్యం సంపాదించింది. వరుసగా 7 పాయింట్లు సాధించి 13-6 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన యమగుచి.. ఆపై వెనక్కి తిరిగి చూసుకోకుండా 21-12 తేడాతో సునాయస విజయం సాధించింది. దీంతో యమగుచి వరుసగా నాలుగో టూర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

## వైభవ్ సూర్యవంశీ తమ్ముడి అద్భుత ఇన్నింగ్స్..




స్పోర్ట్స్ డెస్క్: టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ గా మారింది. బౌలర్ ఎవరు అనే విషయం పట్టించుకోకుండా బౌండరీలు బాదడమే వైభవ్ నైజం. అతడి బ్యాటింగ్ విధ్వంసం ధాటికి అనేక రికార్డులు కూడా బద్దలు అయ్యాయి. అంతేకాక 15 ఏళ్ల వయసులోనే సీనియర్ భారత జట్టుకు ఎంపికై.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డునే బ్రేక్ చేశాడు ఈ చిచ్చర పిడుగు. ఈ క్రమంలోనే వైభవ్ సూర్యవంశీ కుటుంబం నుంచి మరో క్రికెటర్ ఇప్పుడు వెలుగులోకి వచ్చాడు.వైభవ్ చిన్న తమ్ముడు ఆశీర్వాద్ సూర్యవంశీ తన అద్భుత బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కేవలం 10 ఏళ్ల వయస్సులోనే సెంచరీ బాది యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. తనకంటే సీనియర్ బౌలర్లను సైతం విడిచిపెట్టలేదు. మైదానంలో బౌండరీల వర్షం కురిపిస్తూ.. అన్న బాటలోనే ఆశీర్వాద్ అడుగులు వేస్తున్నాడు. తాజాగా బిహార్‌లోని సమస్తిపూర్‌లో జరిగిన ఒక స్థానిక ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆశీర్వాద్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు.'క్రికెట్ అకాడమీ తాజ్‌పూర్' జట్టు తరఫున ఆడిన ఈ జూనియర్ వైభవ్ 87 బంతుల్లో 103 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 20 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. తమ్ముడి క్లాస్ ఇన్నింగ్స్ చూసి సంతోషం వ్యక్తం చేసిన వైభవ్ సూర్యవంశీ... సోషల్ మీడియా ద్వారా ఆశీర్వాద్‌కు అభినందనలు తెలిపాడు. ఆశీర్వాద్ స్కోర్ కార్డ్‌కు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు టీమిండియాకు మరో హిట్టర్ దొరికాడంటూ కామెంట్లు చేస్తున్నారు.

## భారత్, అఫ్గాన్ తొలి వన్డేకు పొంచి ఉన్న వాన ముప్పు!

స్పోర్ట్స్ డెస్క్: భారత్, అఫ్గానిస్థాన్ మధ్య మూడు వన్డేల సిరీస్ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఇవాళ(శనివారం) ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. ఈ మ్యాచ్ కోసం క్రికెట్ ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చాలా కాలం తర్వాత టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ బ్లూ జెర్సీలో కనిపించనున్నాడు. అయితే రోహిత్ ఆట చూద్దామనుకునే అభిమానులకు నిరాశే ఎదురయ్యేలా ఉంది. ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు తీవ్రంగా పొంచి ఉంది. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, మ్యాచ్ జరిగే సమయంలో దాదాపు 90 శాతం వర్షం పడే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉండటంతో మ్యాచ్‌కి తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది.శుక్రవారం సాయంత్రం నుంచి ధర్మశాలలో వర్షం పడుతుంది. ఇవాళ ఉదయం కూడా కాసేపు చిన్నపాటి వర్షం కురిసింది. మరోసారి మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల మధ్య భారీగా వర్షం కురిసే సూచనలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే మూడు రోజుల పాటు హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు, ఉరుములు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ఇవాళ ఒకవేళ వర్షం అంతరాయం కలిగిస్తే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిని అమలు చేసే అవకాశం ఉంది.



# సినిమా

## జూన్ 14 నుండి ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కానున్న "ఇల్లు"

మనోహర ఆర్ట్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా సమర్పిస్తూ కిషోర్ మారిశెట్టి నిర్మాతగా రోహిత్, శశి దర్శకత్వంలో ఈటీవీ విన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్న కథ సుధ చిత్రం ఇల్లు. వివేక్ సాగర్ సంగీతాన్ని అందించిన ఈ కథ సుధకు శశాంక్ రాఘవుల సినిమాటోగ్రఫీ చేయగా అవంతి రుయా ఎడిటింగ్ చేశారు. హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి ప్రముఖ పాత్రలో కనిపించిన చిత్రంలో అనీష్ కురువిల్ల, పవన్ రమేష్, క్యాంప్ శశి తదితరులు కీలకపాత్రలు పోషించారు. జూన్ 14వ తేదీ నుండి ఈటీవీ విన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ఈ కథ సుధ చిత్ర బృందం మీడియా వారికి ఎక్స్క్లూజివ్ స్ట్రీమింగ్ తో పాటు ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది.

ఈ స్ట్రీమింగ్ కు హాజరైన నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ... "ఒక సాధారణ కథను సహజ సిద్ధంగా అదేవిధంగా చాలా అందంగా ప్రేక్షకులు ముందుకు తీసుకుని రావడం అనేది ఎంతో క్లిష్టమైన విషయం. జూన్ 14 నుండి స్ట్రీమింగ్ కానున్న ఇల్లు మీ మనసులో ఎంతో ప్రశాంతతను తెలుపుతుంది" అన్నారు.

నటి బిందు చంద్రమౌళి మాట్లాడుతూ... "నాకు ఈ చిత్ర దర్శకులు రోహిత్, శశిలు ఎంతో కాలం నుండి తెలుసు. నాకు ఇల్లులో నటించేందుకు అవకాశం ఇచ్చిన వారి ఇద్దరికీ ధన్యవాదాలు అనుకుంటున్నాను. మేము రెగ్యులర్గా చేసే నటన నుండి ఇది కాస్త భిన్నంగా ఉంటుంది. మొదటిసారి నేను ఇల్లు చూసినప్పుడు నాకు ఎలా చెప్పాలో కూడా మాటలు రాలేదు, అంత బాగుంది, నాకు అంతగా నచ్చేసింది. వివేక్ సాగర్ సంగీతం చాలా అద్భుతంగా అనిపించింది. కిషోర్ గారికి, ఈటీవీ వారికి థాంక్స్. హర్ష గారితో గతంలో కూడా కొన్ని చిత్రాలలో కలిసి నటించాను. మరోసారి బృందం అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అన్నారు.

నటుడు అనీష్ కురువిల్ల మాట్లాడుతూ... "నాకు దర్శకులు శశి, రోహిత్ ఎంతో కాలం నుండి తెలుసు. వారి కష్టాన్ని, వారి ఆలోచనలను నేను గమనించాను. ఇటువంటి ప్రతిభ ఉన్న వారిని ఎంకరేజ్ చేసినందుకు ఈటీవీ విన్ వారికి థ్యాంక్స్. ఇటువంటి సహజ సిద్ధమైన పాత్రలో నటించడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. ఇటువంటి దర్శకుల ప్రతిభను గుర్తించి, ప్రోత్సహిస్తున్న ఈటీవీ విన్ వారికి థాంక్స్. ఇటువంటి కథలకు ఇది ఆరంభం మాత్రమే. ఈ చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉంది" అన్నారు.




దర్శకుడు రోహిత్ మాట్లాడుతూ... "ఈ సినిమా చాలా పద్ధతిగా చేశాము. ఈ రోజుల్లో ఒక చిన్న కథను చూపించడం, దానికి సంగీతం తోడుగా ఉండి ప్రేక్షకులకు చేరడం ఒక ప్రత్యేకమైన విషయం. మరో మూడు రోజుల్లో ఈ చిత్ర షూటింగ్ చేయాలి అనగా నాకు కాస్త సందేహంగా ఉన్న సమయంలో పర్ఫెక్ట్ డేస్ అనే చిత్రం నా ఆలోచన మార్చేసింది" అన్నారు.

నిర్మాత కిషోర్ మారిశెట్టి మాట్లాడుతూ... "నేను మనోహరి ఆర్ట్స్ ద్వారా ముందుగా రాణి అని ఆహాలో ఒక ప్రాజెక్ట్ చేశాము. సినిమాలు కూడా చేశాను. ఇప్పుడు నిర్మాతగా రావడానికి కారణం రామానాయుడు గారు, రామోజీ గారు. ఒక ఆర్టిస్టుగా నేను ఇండస్ట్రీకి వచ్చినప్పటికీ ప్రొడక్షన్ ఎలా చేయాలి అనేది నేర్చుకున్నాను. కొత్త కంటెంట్ తీసుకునే రావడం నాకు సంతోషాన్నిస్తోంది. ఈ ప్రాజెక్ట్ నా దగ్గరకి వచ్చినప్పుడు నాకు దర్శకుల పై మంచి నమ్మకం వచ్చింది. వీరి విభిన్నమైన దర్శనత్వ శైలి ప్రత్యేకంగా ఉంటుంది. ఇద్దరు దర్శకులను తెలిసినప్పుడు నేను కాస్త ఆలోచించాను, కాని వారి ఆలోచన చూసి నేను ఆశ్చర్యపోయాను. హర్షవర్ధన్ గారి లాంటి సీనియర్ నటుడు ఈ పాత్రను చేయడం ఒక పెద్ద విషయం. నాకు నిర్మాణం పట్ల ఒక అవగాహన ఉండటంతో నా పరిధిలో నేను ఉండి ఈ ప్రాజెక్టు చేశాను. హర్ష గారి సహకారం, వివేక్ సాగర్ సంగీతం అందించడం మాకు బాగా బలాన్ని ఇచ్చింది. ఈ చిత్ర బృందం అందరికీ థాంక్స్" అన్నారు.

## ఘనంగా 'పోలీస్ కంప్లైంట్' మూవీ సక్సెస్ సెలబ్రేషన్స్



వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి, రాగిణి ద్వివేది ప్రధాన పాత్రల్లో ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించిన హారర్–యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్' జూన్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో చిత్రబృందం ఘనంగా సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. కేక్ కట్ చేసి చిత్ర విజయాన్ని ఆనందంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ఈ సినిమా హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్ సినిమా ప్రమోషన్‌లో పాల్గొనలేదని చిత్రయూనిట్ ఆరోపణల నేపథ్యంలో ఆమె ప్రొడ్యూసర్ కౌన్సిల్ ను సంప్రదించారు. ఈ వివాదాన్ని పెద్దల జోక్యంతో సానుకూలంగా పరిష్కరించుకున్నామని చెప్పాను. దీంతో దర్శకుడు సంజీవ్ మేగోటి గారు తన తప్పు లేకపోయినా వరలక్ష్మికి సారీ చెప్పారు. ఆయన ప్రదర్శించిన వినయం, సహనమే ఈ విజయానికి మరో కారణమని పేర్కొన్నారు. సినిమా మంచి కలెక్షన్లతో ముందుకు సాగడం ఇండస్ట్రీకి కూడా శుభపరిణామమని అన్నారు.

దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, "మా చిత్ర హీరోయిన్ వరలక్ష్మి శరత్ కుమార్ నాలెడ్జ్ కంటే మా నాలెడ్జ్ లక్ష రేట్లు ఎక్కువ ఉంది. అందుకే ప్రసన్న కుమార్ వంటి పెద్దల సూచన మేరకే ఆమెకు సారీ చెప్పడం జరిగింది. అంతేకానీ, సమస్య పూర్తి సర్దుమణిగిందని కూడా చెప్పలేను. మొత్తానికి ఒక వివాదంతో సతమతం అయ్యాం.. చివరికి విజయంతో శుభం కార్డు పడిందని భావిస్తున్నాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విడుదలైన 'పోలీస్ కంప్లైంట్'కు అద్భుతమైన స్పందన వస్తోంది. విడుదలైన రెండవ రోజు నుంచే థియేటర్‌లు పెరుగుతున్నాయి. దర్శకుడిగా, రచయితగా, సంగీత దర్శకుడిగా ఈ సినిమా నాకు ఎంతో ప్రత్యేకం. చిత్రబృందంలోని ప్రతి ఒక్కరి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైంది. సూపర్ స్టార్ కృష్ణగారికి నివాళిగా రూపొందించిన ప్రత్యేక గీతానికి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. థియేటర్ల నుంచి బయటకు వచ్చే ప్రేక్షకులు సంతృప్తిగా స్పందించడం మాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని అన్నారు.

అలాగే, "52 మంది సీనియర్ ఆర్టిస్టులతో కేవలం 45 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే విభిన్న కాన్సెప్ట్ ఆధారంగా రూపొందిన ఈ కథలో హారర్, థ్రిల్లర్, యాక్షన్ అంశాలను సమన్వయం చేశాం. ఈ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రతి ప్రేక్షకుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.

హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, "సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. దర్శకుడు సంజీవ్ మేగోటి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. నా అభిమాన నటుడు సూపర్ స్టార్ కృష్ణగారిని గుర్తు చేసే పాటలో నటించడం నాకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చింది. కుటుంబ సమేతంగా చూసే మంచి వినోదాత్మక చిత్రం ఇది" అన్నారు.

నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ, "వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు, స్నేహితులు ఫోన్ చేసి సినిమా గురించి ప్రశంసించడం ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో భాగస్వామి కావడం సంతోషంగా ఉంది. అవకాశం ఇచ్చిన దర్శకుడు సంజీవ్ మేగోటి గారికి ధన్యవాదాలు" అన్నారు.

నటుడు విజయభాస్కర్ మాట్లాడుతూ, "కర్మ సిద్ధాంతం ఆధారంగా తెరకెక్కిన ఈ కథ నాకు చాలా నచ్చింది. 'బతుకమ్మ' సినిమా తర్వాత నాకు ఈ స్థాయిలో సంతృప్తినిచ్చిన చిత్రం ఇదే. ఈ సినిమాలో చేసిన పోలీస్ పాత్రకు మంచి గుర్తింపు లభిస్తోంది" అని చెప్పారు.

డిస్ట్రిబ్యూటర్ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ, "పెద్ద చిత్రాలకు ధీటుగా ఈ సినిమాను విడుదల చేశాం. పాజిటివ్ టాక్‌తో సినిమా థియేటర్లలో విజయవంతంగా కొనసాగుతోంది" అన్నారు.

నిర్మాత ఘంటా శ్రీనివాస్ మాట్లాడుతూ, "సినిమాలో ప్రతి నటుడు తన పాత్రకు పూర్తి న్యాయం చేశాడు. ప్రేక్షకుల ఆదరణ మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది" అన్నారు.హారర్, యాక్షన్, కామెడీ, రొమాన్స్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన 'పోలీస్ కంప్లైంట్' ప్రస్తుతం పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకులను అలరిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

చిత్ర బృందం

నటీనటులు: వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి, రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, పృథ్వి, కృతి వర్మ, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, ప్రీతి సుందర్, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్, దిల్ రమేష్, మధు నంబియార్, సత్తెన్న, విజయభాస్కర్ తదితరులు.

## ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రం పెద్ద హిట్ అవ్వాలి – వి. వి. వినాయక్

వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాత్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో..

×వి.వి. వినాయక్ మాట్లాడుతూ× .. "వడ్డే నవీన్ గారు ఈ కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు థాంక్స్. నేను ఆయన చిత్రానికి అసిస్టెంట్, కో డైరెక్టర్‌గా పని చేశాను. నవీన్ గారితో సినిమా చేస్తున్న టైంలోనే 'ఆది'కి నాంది పలికినట్టు అయింది. నవీన్ గారు నన్నెంతో ఇష్టంగా చూసుకునేవారు. ఆయన కెరీర్‌లోని 90 శాతం సినిమాలు మనస్ఫూర్తిగా ఇష్టంతో చేయలేదు. ఆ విషయం నాకు తెలుసు. సినిమాల పట్ల ఆయనెప్పుడూ తృప్తిగా ఉండరు. ఓ సందర్భంలో ఆయన పరపతి చూసి షాక్ అయ్యాను. ఇకపై ఆయన తన మనసుకు నచ్చిన చిత్రాలే చేయాలని కోరుకుంటున్నాను. 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రం పెద్ద హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.

×వడ్డే నవీన్ మాట్లాడుతూ× .. "వినయ్ అప్పుడూ, ఇప్పుడూ వినయంగానే ఉన్నారు. ఆయన జర్నీ నాకెంతో గర్వంగా అనిపిస్తుంది. మా కోసం వచ్చిన వినయ్‌కి థాంక్స్. సినిమా కోసం టీం అంతా ఇష్టపడి చేశారు. ఈ పదేళ్లలో టెక్నికల్ పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మూవీలో కోర్ట్ డ్రామాతో పాటు సస్పెన్స్ బాగుంటుంది. ఏ ఫ్రైడే అయినా కూడా సింగిల్‌గా సినిమా రాలేదు. ఒకరితో పోటీ అని కాదు.. మూవీ బాగుంటేనే ఆడియెన్స్ చూస్తారు. ఈ చిత్రాన్ని సహజత్వానికి దగ్గరగా ఉండేలానే చూసుకున్నాం. ఇందులోని కంటెంట్ స్ట్రాంగ్‌గా ఉంటుంది. మాకు జీ టీం కూడా సపోర్ట్ చేస్తోంది. జూన్ 19న మా చిత్రం రాబోతోంది. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

×డైరెక్టర్ కమల్ తేజ నార్ల మాట్లాడుతూ× .. 'మా 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంటుంది. టీజర్, ట్రైలర్‌ల కంటే సినిమా అద్భుతంగా ఉండబోతోంది. మా కోసం వచ్చిన వినాయక్ గారికి థాంక్స్. నాకు ఈ అవకాశం ఇచ్చిన నవీన్ గారికి ఎప్పుడూ రుణపడి ఉంటాను. టీం అంతా ఎంతో కష్టపడి, ఇష్టపడి చేశారు. జూన్ 19న సినిమాని చూడండి. తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

×రాశీ సింగ్ మాట్లాడుతూ× .. 'మా కోసం వచ్చి, ట్రైలర్‌ను లాంచ్ చేసిన వి. వి. వినాయక్ గారికి థాంక్స్. మా టీజర్, పాటలకు మంచి



రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్ కూడా అందరికీ నచ్చే ఉంటుందని ఆశిస్తున్నాను. జూన్ 19న మా చిత్రం రాబోతోంది. వడ్డే నవీన్ గారితో పాటు ప్రతీ ఒక్కరూ ప్రాణం పెట్టి పని చేశారు. అందరూ మా మూవీని చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×సంగీత దర్శకుడు కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ× .. 'మా 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ట్రైలర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. ఈ సినిమా పెద్ద సక్సెస్ కాబోతోంది. ఈ టీం నుంచి మరిన్ని మంచి చిత్రాలు రావాలని కోరుకుంటున్నాను. జూన్ 19న అందరూ మా మూవీని చూడండి' అని అన్నారు.

×విజయ్ పోలకి మాట్లాడుతూ× .. "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ట్రైలర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. వడ్డే నవీన్ గారితో వర్క్ చేయడంతో ఎంతో నేర్చుకున్నాను. ఇందులో నేను రెండు పాటలకు కొరియోగ్రఫీ అందించాను. నవీన్ గారు ఎంతో కూల్‌గా ఉంటారు. జూన్ 19న ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×కెమెరామెన్ కార్తీక్ సుజాత సాయికుమార్ మాట్లాడుతూ× .. "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ట్రైలర్ కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. మా సినిమాని అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×ఆర్ట్ డైరెక్టర్ భిక్షపతి కందకట్ల మాట్లాడుతూ× .. 'మా 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' పెద్ద విజయం సాధిస్తుంది. నవీన్ గారి ఎనర్జీ హై రేంజ్‌లో ఉంటుంది. జూన్ 19న మా సినిమాని అందరూ చూడండి' అని అన్నారు.

నటీనటులు : వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాత్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు

## ప్రైమ్ వీడియోలో జూన్ 18 నుంచి 'దృశ్యం 3' మూవీ

భారతీయ సినీ చరిత్రలో అత్యంత ప్రజాదరణ పొందిన థ్రిల్లర్ ఫ్రాంచైజీలలో ఒకటైన 'దృశ్యం' సిరీస్ మూడో భాగం 'దృశ్యం 3' ప్రపంచవ్యాప్తంగా జూన్ 18 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. జీతూ జోసెఫ్ రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఆంథోనీ పెరుంబవూర్ నిర్మించగా, మోహన్‌లాల్, మీనా, సిద్ధిక్ కీలక పాత్రల్లో నటించారు. థియేటర్లలో విజయవంతమైన ప్రదర్శన అనంతరం ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో కూడా అందుబాటులోకి రానుంది.

'దృశ్యం 2' సంఘటనల తర్వాత జార్జ్‌కుట్టి తన కుటుంబానికి భద్రమైన భవిష్యత్తును నిర్మించుకున్నట్లు కనిపిస్తుంది. తన గత అనుభవాలను ఆధారంగా చేసుకుని ఒక విజయవంతమైన సినిమాను కూడా రూపొందిస్తాడు. అయితే గతం మళ్లీ అతడిని వెంటాడుతుంది. ఆ సినిమా వెనుక ఉన్న నిజాలను వెలికితీయడానికి ఇద్దరు జర్నలిస్టులు ప్రయత్నించగా, కుమార్తె అంజూకు వచ్చిన వివాహ ప్రతిపాదన ఒక ప్రమాదకరమైన ఉచ్చుగా మారుతుంది.

పాత శత్రువులు కొత్త ఉద్దేశాలతో తిరిగి రంగంలోకి దిగడం, భయం, అనుమానాలు, అపరాధ భావనలతో పరిస్థితులు మరింత క్లిష్టంగా మారడం వల్ల జార్జ్‌కుట్టి మరోసారి తన కుటుంబాన్ని కాపాడేందుకు పోరాడాల్సి వస్తుంది. సస్పెన్స్, భావోద్వేగాలు, ఉత్కంఠభరిత మలుపులతో కూడిన ఈ చిత్రం ప్రేక్షకులకు మరోసారి అద్భుతమైన థ్రిల్లర్ అనుభూతిని అందించనుంది.



## ఒక్క చూపుతో మెదలైన..' మూవీ ట్రైలర్ విడుదల

శివచౌదరి, జశ్విక హీరో హీరోయిన్లుగా చెంచయ్య నూతలపాటి దర్శకత్వంలో శ్రీ ఆంజనేయ క్రియేషన్స్ పతాకంపై పోలూరి బిందుసారధి నిర్మిస్తున్న చిత్రం 'ఒక్క చూపుతో మెదలైన..'. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ విడుదలయింది. ఈ ట్రైలర్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హీరో శ్రీకాంత్ , నటుడు శివాజీరాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఒక్క చూపుతో మెదలైన..' ట్రైలర్ ను విడుదల చేసిన హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ .." చెంచయ్య నూతలపాటి దర్శకత్వంలో తెరకెక్కిన 'ఒక్క చూపుతో మెదలైన..' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని సినిమా ట్రైలర్ చూస్తే అర్ధమవుతుంది. పోలూరి బిందుసారధి నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పుడొస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండి అందరి మనసుల్ని గెలుచుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. సినిమా విజయం సాధించి ఈ సంస్థ నుంచి మరిన్ని మంచి చిత్రాలు రావాలని కోరుకుంటూ చిత్ర యూనిట్ కు ఈ సందర్భంగా బెస్ట్ విషెష్ చెప్పారు. నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ.. ప్రస్తుతం టాలీవుడ్ లో వస్తున్న చిత్రాలను మనం గమనిస్తూనే ఉన్నాం. మంచి కంటెంట్ తో వస్తున్న చిత్రాలను ప్రేక్షకులు ఎంతగానో ఆదరించి అక్కున చేర్చుకుంటున్నారు. మంచి విజయాల్ని అందిస్తూ నటీనటులను, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల వచ్చిన 'రాజు వెడ్స్ రాంబాయి'లాగే ఈ చిత్రం కూడా మంచి విజయాన్ని అందుకోవాలని అకక్షశించారు. దర్శకుడు చెంచయ్య నూతలపాటి మాట్లాడుతూ .." మంచి కంటెంట్ తో ఈ సినిమాను తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే విధంగా సినిమా సాగుతుంది. నిర్మాత పోలూరి బిందుసారధి సినిమా చక్కగా రూపొందడానికి పూర్తి సహకారాన్ని అందించారు. ఎక్కడా రాజీ పడకుండా మాకు ఏం కావాలంటే అది వెంటనే సమకూర్చి సినిమా బాగా రావడానికి తోడ్పడ్డారు" అని చెప్పారు.

నిర్మాత పోలూరి బిందుసారధి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి సహకరించిన ఆటో కిషోర్, లింగం గూడు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

శివచౌదరి, జశ్విక, డి.ఎస్. రావు, సత్యవర్మ, పటాస్ రాము, అమన్ సింగ్, సాయి రామకృష్ణ, చెంచయ్య, స్వరాజ్యం ప్రసన్నరాణి అంజలి, ఉషా, చిన్నీ, లక్ష్మి తదితరులు నటించిన ఈ సినిమాకు కెమెరా: అనం వెంకట్, ఎడిటర్: మహేంద్రనాథ్, సంగీత: చైతన్య రాజ, కో –డైరెక్టర్ చందు, పి.ఆర్.ఓ : బాబునాయక్ (సినీసందడి, సినీలోకం), నిర్మాత పోలూరి బిందుసారధి, కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : చెంచయ్య నూతలపాటి,

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com